


చురుగ్గా సాగుతున్న ఆర్‌వోఆర్ పనులు

శరవేగంగా.. ఎలివేటెడ్ ఆర్‌వోఆర్

- గుణదల-వెదురుపావులూరు వద్ద పనులు
- విజయవాడ-కాజీపేట మూడోలైన్‌లో అంతర్భాగం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ-కాజీపేట థర్డ్‌లైన్ ప్రాజెక్టులో అంతర్భాగంగా గుణదల-వెదురుపావులూరు మధ్య ఎలివేటెడ్ రైల్వేలైన్ అయిన రైల్ ఓవర్ రైల్ (ఆర్‌వోఆర్) ప్రాజెక్టు శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. ఏపీ, తెలంగాణాను కలుపుతూ నిర్మిస్తున్న ఈ మూడో లైన్‌లో అంతర్భాగంగా విజయవాడ పరిధిలో బైపాస్ రైల్వేలైన్‌ను నిర్మిస్తున్నారు. ఈ లైన్‌లో రెండు ఆర్‌వోఆర్‌లను తలపెట్టారు. విజయవాడ నార్త్ క్యాబిన్ నుంచి రాయనపాడు వరకు ఒక ఆర్‌వోఆర్, విజయవాడ నార్త్ క్యాబిన్ నుంచి గుణదల మీదుగా వెదురుపావులూరు వరకు మరో ఆర్‌వోఆర్ నిర్మిస్తున్నారు. ఇందులో గుణదల-వెదురుపావులూరు మార్గంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొత్తం నాలుగు కిలోమీటర్ల నిడివిలో జరుగుతున్నాయి. విజయవాడ నార్త్ క్యాబిన్ నుంచి గుణదల వరకు మూడోలైన్ పనులు నిర్మించారు. వెదురుపావులూరు సరిహద్దు నుంచి ఆర్‌వోఆర్ అప్రోచ్ పనులు మొదలయ్యాయి. అప్రోచ్‌కు అనుసంధానంగా ఆర్‌వోఆర్ (ఎలివేటెడ్ రైల్వే లైన్) నిర్మాణ పనులు చేపట్టి పిల్లర్లు నిర్మిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ రైల్వేలైన్ పనులు వెదురుపావులూరు-ముస్తాబాద పరిధిలో జరుగుతున్నాయి. గుణదల సరిహద్దు, వెదురుపావులూరు నుంచి పొలాల మీదుగా రైల్వే పట్టాలను క్రాస్ చేస్తూ ముస్తాబాద దగ్గర రైల్వేట్రాక్‌కు ఈ ఆర్‌వోఆర్ అనుసంధానమవుతుంది. ఇది 'ఎస్' ఆకారంలో రూపుదిద్దుకుంటోంది. ఆరు నెలల్లో పనులన్నీ పూర్తవుతాయి. ఈ రైల్ మార్గం మొత్తం 219 కిలోమీటర్లు ఉంటుంది. రూ.1,952 కోట్లతో నిర్మిస్తున్న ఈ మార్గం తెలంగాణాలో 184 కిలోమీటర్లు, ఏపీలో 35 కిలోమీటర్లు ఉంది. ఏపీలో చెరువు మాధవరం నుంచి న్యూ వెస్ట్ బ్లాక్ హాట్ క్యాబిన్ వరకు 16.7 కిలోమీటర్ల మేర మూడో లైన్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనుల్లో భాగంగా కొంతమేర లైన్, మరికొంత మేర రెండు ఆర్‌వోఆర్‌లను పూర్తి చేయాల్సి ఉంది. విజయవాడ నార్త్ క్యాబిన్ నుంచి రాయనపాడు మార్గంలో నిర్మిస్తున్న ఆర్‌వోఆర్ పనుల్లో ఆశించినంత పురోగతిలో లేదు.

కృష్ణానదికి వరద ఉధృతి



మద్దూరులోని ఎన్టీఆర్ పుష్కర ఘాట్ వద్ద సుడులు తిరుగుతున్న వరద


గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానదిలో వరద ఉధృతి పెరిగింది. సుడులు తిరుగుతూ మద్దూరు ఎన్టీఆర్ పుష్కర ఘాట్‌ను వరద నీరు ముంచెత్తింది. మద్దూరు, కాసరనేని వారి పాలెం గ్రామాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల ప్రజల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. **- ఆంధ్రజ్యోతి-కంకిపాడు**

అడ్డగోలుగా విభజించారు. అందేంటని అడిగినా.. ప్రశ్నించినా కనీసం పట్టించుకోలేదు. జిల్లాల పునర్విభజన పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ఆడిన ఆటలో కీలకమైన ప్రాంతాలు ఆ జిల్లా కేంద్రానికి దూరం కాగా, ప్రొటోకాల్ విధులు అధికారులకు తలనొప్పిగా మారాయి. పార్లమెంట్ నియోజకవర్గ ప్రాతిపదికగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలుగా విభజించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ క్రమంలో జిల్లాల పునర్విభజన సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం మంత్రులతో కమిటీని ఏర్పాటు చేయటాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. మంత్రులు తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలని కోరుతున్నారు.

\- విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

విభజన విన్నపాలు వినవలె..!


కృష్ణాజిల్లాలో ఉన్న విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం



జిల్లాల విభజన సమస్యలపై మంత్రుల కమిటీని స్వాగతిస్తున్న ఉమ్మడి కృష్ణా ప్రజలు

- వైసీపీ హయాంలో అడ్డగోలుగా మార్పులు చేర్పులు
- ప్రజల నుంచి అభ్యర్థనలు వచ్చినా పట్టించుకోలేదు
- విజయవాడకు దగ్గరలోని పెనమలూరు, గన్నవరం కృష్ణాలో విలీనం
- బందరు వెళ్లాలంటే దూరాభారం.. పాలనా ఇబ్బందులు, సమస్యలు
- విజయవాడ ఎయిర్‌పోర్టు కృష్ణాజిల్లా పరిధిలోకి..
- ప్రొటోకాల్ విధుల కోసం బందరు నుంచి రాకపోకలు
- నూజివీడును ఏలూరు జిల్లాలో కలపడంపై వ్యతిరేకత
- కృష్ణాజిల్లాలో కలుపుతానని నాడు చంద్రబాబు హామీ
- విజయవాడకు దగ్గరలోని గ్రేటర్ విలీన గ్రామాలు కృష్ణాజిల్లాలోకి..
- విజయవాడ రూరల్ మండలం పరిస్థితి అగమ్యగోచరం
- సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంత ప్రజల విన్నపం

ఆ 25 గ్రామాలు ఎటువైపు?

విజయవాడను గ్రేటర్ చేయటం కోసం 25 విలీన గ్రామాలను జిల్లాల పునర్విభజనలో ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ గ్రామాలన్నీ పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలో ఉండగా, కృష్ణాజిల్లాలో చేర్చారు. ఈ రెండు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో వేలాది సంఖ్యలో ప్రజలు అభ్యర్థించినా పట్టించుకోలేదు. గన్నవరం, పెనమలూరు ప్రాంత ప్రజలకు విజయవాడ కనిష్టంగా 5 కిలోమీటర్ల నుంచి గరిష్టంగా 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. అదే కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నం అయితే కనిష్టంగా 50 కిలోమీటర్ల నుంచి గరిష్టంగా 75 కిలోమీటర్ల దూరంలో ఉంది. గన్నవరం, పెనమలూరుకు చెందిన వేలమంది ప్రజలు కలెక్టర్‌ను కలవటానికి మచిలీపట్నం వెళ్లాల్సి వస్తోంది. విజయవాడను ఆనుకుని ఉండే ఈ రెండు నియోజకవర్గాల ప్రజలు ఎక్కడో ఉన్న మచిలీపట్నానికి వెళ్లడం ఇబ్బందిగా మారింది.

రూరల్ మండలం ఓ గందరగోళం

ఒక మండలం ఒకే నియోజకవర్గంలో ఉంటే సమస్యలు ఉండవు. విజయవాడ రూరల్ మండలం ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే ఉంది. ఇందులోని తొమ్మిది గ్రామ పంచాయతీలు గన్నవరం నియోజకవర్గ పరిధిలో, ఏడు గ్రామ పంచాయతీలు మైలవరం నియోజకవర్గ పరిధిలో ఉంటాయి. గన్నవరం కృష్ణాజిల్లాలో, మైలవరం ఎన్టీఆర్ జిల్లాలో ఉన్నాయి. స్థూలంగా విజయవాడ రూరల్ మండల పరిపాలన ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి వస్తుంది. కానీ, ఓటుహక్కు నమోదుకు కృష్ణాజిల్లా అనే పేర్కొనాలి. ఈ సమస్యలను మిగతా 6లో..

విజయవాడ విమానాశ్రయం కృష్ణాజిల్లాలో..!

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరం నియోజకవర్గంలో ఉంది. కానీ, ఇది కృష్ణాజిల్లా పరిధిలోకి వస్తుంది. దీనివల్ల ఎయిర్‌పోర్టు ప్రొటోకాల్ డ్యూటీలు చేయటం కృష్ణాజిల్లా యంత్రాంగానికి ఇబ్బందిగా మారింది. ప్రొటోకాల్ విధుల కోసం 75 కిలోమీటర్లు దాటి గన్నవరం వస్తున్నారు.



గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

అంధకారంలో.. సర్వజన ఆసుపత్రి!

6

జిల్లాలో భారీ వర్షం

మచిలీపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 8.30 గంటల వరకు గన్నవరంలో అత్యధికంగా 49.2 మిల్లీ మీటర్లు, పమిడిముక్కలలో అత్యల్పంగా 1.2 మిల్లీ మీటర్లు పడింది. జిల్లా సగటు వర్షపాతం 9.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఈ నెల 26వ తేదీ వరకు కోస్తా తీరం వెంబడి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. 27 నుంచి 29వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని తెలిపింది. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో వరినాట్లు వేగవంతమయ్యాయి.

నీలినీడలు!

ప్రశ్నార్థకంగా భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ భవిష్యత్తు!

- లీజుకు ఇచ్చిన 6,500 ఎకరాలు స్వాధీనానికి గత ప్రభుత్వంలో నోటీసులు జారీ
- దీనిపై హైకోర్టును ఆశ్రయించిన ఫ్యాక్టరీ యాజమాన్యం
- విషయం తేలకపోవడంతో ఈ ఏడాది ఉప్పు ఉత్పత్తి నిలిపివేత
- ఉపాధి కోల్పోయిన 2 వేల కుటుంబాలు

మచిలీపట్నం మండలం పల్లెతుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మచిలీపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమల ఏర్పాటుకు భారత్ సాల్ట్ భూములను కేటాయిస్తామని, ఈ ఫ్యాక్టరీకి ఇచ్చిన భూములను ఖాళీ చేయించేందుకు గత ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. ఆయిల్ రిఫైనరీ లేదా హైడ్రో విద్యుత్ ఉత్పత్తికి ఈ భూములను కేటాయిస్తామని విస్తృత ప్రచారం చేసింది. అయితే ఈ ఫ్యాక్టరీ భూములను స్వాధీనం చేసుకునేందుకు జారీ చేసిన నోటీసుల వెనుక పెద్ద కుట్ర దాగుందన్న విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై భారత్ సాల్ట్ కంపెనీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. ఈ వివాదం నేపథ్యంలో ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిచిపోయి రెండు వేల మందికి ఉపాధి కరువైంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం పల్లెతుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ కంపెనీకి గతంలో 6,500 ఎకరాలను లీజుకు ఇచ్చారు. ఆ భూములను ఖాళీ చేయాలని 2023 సెప్టెంబరులో అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మళ్లీ 2024లో ఫ్యాక్టరీ భూములను ఖాళీ చేయాలని, ఖాళీ చేసే సమయంలో రూ.300 కోట్లను ప్రభుత్వానికి చెల్లించాలని గత వైసీపీ ప్రభుత్వం భారత్ సాల్ట్ కంపెనీకి నోటీసులు ఇచ్చింది. దీనిపై కంపెనీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ ఫ్యాక్టరీ వివాదాల్లో చిక్కుకుపోయింది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడక పోవడంతో ఉప్పు ఉత్పత్తిని ఈ ఏడాది నిలిపి వేసింది. ఏటా డిసెంబరు నెల నుంచి జూన్, జూలై నెలల వరకు ఉప్పు ఉత్పత్తిని ఇక్కడ చేసేవారు. తీర ప్రాంతంలోని పల్లెతుమ్మలపాలెం, కోన, పోలాటితిప్ప


బందరు మండలం పల్లెతుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ

గ్రామాలకు చెందిన రెండు వేల మందిపైగా ఇక్కడ పనిచేస్తూ గత 23 సంవత్సరాలుగా జీవనం సాగిస్తుండగా, ఈ ఏడాది వారికి పనిలేకుండా పోయింది.

తనఖా పెట్టేందుకు ప్రయత్నాలు చేసి..

భారత్ సాల్ట్ భూములపై కన్నేసిన గత వైసీపీ పెద్దలు సాల్ట్ ఫ్యాక్టరీకి లీజుకు ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకుని, ఈ భూములను తనఖా పెట్టేందుకు తెరవెనుక ప్రయత్నాలు చేసినట్లు అధికారులు చెప్పుకుంటున్నారు. కంపెనీకి ఇచ్చిన 6,500 ఎకరాలను, ఎకరం రూ.7లక్షల చొప్పున ధరగా నిర్ణయించి రుణం తీసుకునేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. 24 సంవత్సరాల క్రితం ప్రభుత్వం తమకు లీజుకు ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు ఇవ్వడంతో పాటు, తనఖా పెట్టేందుకు ప్రయత్నిస్తోందనే కారణంతో కంపెనీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. స్థానికుల ఉపాధికి గండికొడుతూ సాల్ట్ భూములను స్వాధీనం చేసుకునేందుకు గత ప్రభుత్వ పెద్దలు తెగబడ్డారనే విషయం బయటకు రావడంతో అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది..

నిలిచిన ఉప్పు ఉత్పత్తి

సాల్ట్ ఫ్యాక్టరీకి లీజుకు ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకుంటామని గత వైసీపీ ప్రభుత్వం పలుమార్లు భారత్ సాల్ట్ కంపెనీకి మిగతా 6లో..

పదోన్నతుల రగడ

- సీఆర్‌డీఏ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పదోన్నతులకు అడ్డు
- క్యాబినెట్ ఆమోదం తర్వాత.. జీవో విడుదల
- నెల కావస్తున్నా.. పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) ప్రణాళికా విభాగంలో పనిచేస్తున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పదోన్నతుల విషయంలో రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాన్ని కూడా అధికారులు ఖాతరు చేయట్లేదు. సీఆర్‌డీఏలోని ప్రణాళికా విభాగంలోకి శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టి.. 2015-16 మధ్యకాలంలో సీఆర్‌డీఏ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లను తీసుకున్నారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలోనే నియమించారు. అయితే, అసిస్టెంట్ డైరెక్టర్లకు పదోన్నతులు వర్తింపజేశారు కానీ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు ఇవ్వలేదు. అసిస్టెంట్ డైరెక్టర్లు.. జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతులు పొందారు. వీరితో పాటు వచ్చిన బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రం ఎలాంటి పదోన్నతులు పొందలేదు. దీనిపై సీఆర్‌డీఏ పరిధిలోని మొత్తం 20 మంది బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తమ గోడును ప్రభుత్వం, మున్సిపల్ మంత్రికి విన్నవించుకున్నారు. సీఆర్‌డీఏ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు కూడా పదోన్నతులు కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ (టీపీఏ) పోస్టులను సృష్టిస్తూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ నిర్ణయం తర్వాత జూన్ 26న జీవో ఎంఎస్ నెంబర్ 112ను విడుదల చేశారు. దాదాపు నెల రోజులు అవుతున్నా సీఆర్‌డీఏ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పదోన్నతుల మిగతా 6లో..

సీఆర్‌డీఏ కార్యాలయ భవనం


తప్పుడు కేసులో ఇరికించారంటూ ఐటీ ఉద్యోగి ఆందోళన

చోరీలకు పాల్పడిన ముగ్గురు విద్యార్థుల అరెస్టు

స్త్రీ ఆరోగ్య బీమా.. కార్మికులకు మరింత ధీమా

8



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా, కొనకళ్ల నారాయణ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

పామర్రు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాలను సరిచేస్తూ.. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అందిస్తు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటన నడిపిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆధ్వర్యంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు సరైన రీతిలో గుణపాఠం చెప్పారని.. ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు పట్టం కట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నదన్నారు. సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే.. వైసీపీ అరాచకాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తోందని, దానిలో భాగంగానే మాజీ మంత్రి పేర్నినాని విద్వేషాలు రెచ్చగొట్టేలా వాఖ్యలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదికాలంలో ఏడులక్షల కోట్ల పెట్టుబడులు తీసురావడం జరిగిందన్నారు. రాబోయే నాలుగేళ్లకాలంలో ఖచ్చితంగా 25లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంతి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లలా అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఏఎంసీ చైర్మన్ జన్నుశోభన్‌బాబు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి సన్నిధిలో మంత్రి సవిత, ఎమ్మెల్యే చింతమనేని

అభయాంజనేయుని సేవలో మంత్రి సవిత

హనుమాన్‌జంక్షన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామిని బుధవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దర్శనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడు గ్రామంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ముందుగా అభయాంజనేయస్వామిని మంత్రి దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేనితో పాటు దెందులూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత, తెలుగు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, పెదపాడు మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.



గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న గీతాంజలి శర్మ

గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

» జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

ఉంగుటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో గురువారం జరగనున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్నాతకోత్సవంలో గవర్నర్, అగ్రికల్చర్ యూనివర్సిటీ చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో పాటు ముఖ్యఅతిథిగా పూర్వవిద్యార్థి, ఎన్ఆర్ఐ కమిషన్(పంజాబ్)సభ్యులు, పంజాబ్ ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎ.వేణుప్రసాద్ పాల్గొంటున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం వర్సిటీ అధికారులు, జిల్లా అధికారులతో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మినిట్ టు మినిట్ ప్రోగ్రాంపై ట్రయల్‌రన్ నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని గీతాంజలి శర్మ సూచించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, వర్శిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు, ప్రొఫెసర్లు, ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరదేశి తదితరులు పాల్గొన్నారు.

జన సురక్షతో సామాన్యులకు భద్రత

» జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక



కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జన సురక్ష పథకాల ద్వారా సామాన్య ప్రజలకు భద్రత కల్పించడం జరుగుతోందని, ఈ పథకాలను అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) కె.ప్రియాంక అన్నారు. జన సురక్ష పథకాలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎనికేపాడులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో జన సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కలెక్టర్ లక్ష్మీశ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా అర్హులందరూ నమోదు చేసుకొనేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు కనీస పెన్షన్ లభిస్తుందన్నారు. చందాదారుడు మరణిస్తే జీవిత భాగస్వామికి పెన్షన్ లభిస్తుందన్నారు. పీఎం సురక్ష బీమా యోజన పథకంలో మరణం లేదా శాశ్వత వైకల్యం సంభవించిన సందర్భంలో రూ.రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, ఉచిత రూపే డెబిట్ కార్డు ప్రయోజనాలు తదితరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు మిత్రల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను సులభంగా పొందే అవకాశం వుందని ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ మేనేజర్ సిహెచ్.నవీన్ కుమార్, ఎనికేపాడు బ్రాంచ్ మేనేజర్ వినోద్ పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అధికారులకు అవగాహన

కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో అధికారులకు బుధవారం సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చట్టం గురించి వక్తలు మల్లిఖార్జునప్రసాద్ అధికారులకు వివరించారు. జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆడిట్ అధికారి అజిత కుమారి, కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు సేవలు అందించేందుకు, సరైన సమాచారం త్వరితగతిన అందించేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు.

అంధకారంలో.. సర్వజన ఆసుపత్రి!





విద్యుత్ లేకపోవడంతో చీకటిగా మారిన జీజీహెచ్ ఆసుపత్రిలో ఓ విభాగం

» కరెంటు కోతతో సేవల్లో అంతరాయం

» పలు విభాగాల్లో పనిచేయని పరికరాలు.. బారులు తీరిన రోగులు

» జనరేటర్ ఉన్నా చాలని లోడ్

» వైద్య సేవలకు తీవ్ర ఆటంకం

విజయవాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విద్యుత్ వస్తూ పోతుండటంతో పలు విభాగాల్లో సేవలకు అంతరాయం ఏర్పడింది. బుధవారం జీజీహెచ్, సూపర్ బ్లాక్, మెడికల్ కాలేజీల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో రోగులు, విద్యార్థులతో పాటు వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాధారణ విభాగాలతో పాటు ముఖ్యమైన పరికరాలున్న విభాగాల్లో పరీక్షలు, వైద్యం కోసం రోగులు అవస్థలు పడ్డారు. అధిక లోడ్ అవసరమయ్యే మిషనరీలు పనిచేయలేదు. జనరేటర్‌పై సరఫరా ఇచ్చినప్పటికీ సరిపడా లోడ్ అందకపోవడంతో ముఖ్యమైన విభాగాల్లో పరికరాలు పనిచేయలేదు. దీంతో అత్యవసరంగా టెస్టులు కోసం వచ్చిన వారిని సూపర్‌బ్లాక్‌లోకి పంపారు. ఇక్కడ పరికరాలు పనిచేసినప్పటికీ రోగుల తాకిడి ఎక్కువైంది. దీంతో వైద్యం, పరీక్షలకు రోగులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ అంతరాయంతో వైద్యులు ఇబ్బంది పడుతూనే వైద్యం చేశారు.

ముఖ్య విభాగాల్లో పనిచేయని పరికరాలు

విద్యుత్ అంతరాయంతో ఆసుపత్రిలోని ముఖ్యమైన విభాగాల్లోని వైద్య పరికరాలు లోడ్ సరిపోక పని చేయలేదు. దీంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కరెంట్ వస్తూ పోతుండటంతో విద్యుత్ వస్తే టెస్టులు చేయించుకోవచ్చనే ఆశతో రోగులు, పరీక్షలు చేసి పంపాలనే ఆలోచనతో సిబ్బంది ఉన్నారు. విద్యుత్ ఎంతసేపటికీ రాకపోవడం, వైద్య పరికరాలు పని చేయకపోవడంతో అధికసంఖ్యలో రోగులు వెనుదిరిగారు. దూరప్రాంతాల నుంచి వచ్చినవారు అక్కడే గంటల తరబడి ఇబ్బందిపడ్డారు. జీజీహెచ్‌లో జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా చేసినప్పటికీ సీటీస్కాన్, ఎంఆర్ఐ, ఈసీజీ లాంటి ముఖ్యమైన యంత్రాలకు లోడ్ సరిపోలేదు. అత్యవసర పరీక్షలకు సూపర్‌బ్లాక్‌కు రిఫర్ చేశారు.

వైద్యులకూ తప్పని తిప్పలు



విభాగాల వద్ద బారులు తీరిన రోగులు, సహాయకులు

విద్యుత్ అంతరాయంతో వైద్యులు ఇబ్బందిపడ్డారు. పరికరాలు పనిచేయకపోవడం ఒక ఎత్తయితే.. కట్లు కట్టే విభాగం, క్యాజువాలిటీ, రక్త పరీక్షలు చేసే దగ్గర రోగులతో పాటు వైద్యులు కూడా ఇబ్బందికి లోనయ్యారు. వైద్యం మధ్యలో విద్యుత్ పోవడంతో చేసేదేమీలేక వేచి చూడాల్సిన పరిస్థితి.

లిఫ్టుల్లో చిక్కుకుపోయిన రోగులు, సిబ్బంది

లిఫ్టులు ఆగిపోవడంతో రోగులు, సిబ్బంది కొంతసేపు భయాందోళనకు లోనయ్యారు. విద్యుత్ కోతలతో మొరాయించి మధ్యలో ఆగిపోయాయి. బయట ఏం జరిగిందో తెలియక రోగులు, వారి సహాయకులు భయపడిపోయి తర్వాత ఊపిరి పీల్చుకున్నారు. లిఫ్టులు మొరాయించడంతో రోగులను మెట్లు, ర్యాంపు మార్గంలో సహాయకులు పై అంతస్తులకు తీసుకెళ్లారు.

అభివృద్ధి పనులకు టెండర్లు

» కొణతనపల్లి గంగా భ్రమరాంబిక ఆలయ పునర్నిర్మాణం

» బెజవాడలో పీవీపీ మాల్ రోడ్డు నుంచి జమ్మిచెట్టు వరకు యూజీడీ పనులు

» చెన్నుపాటి పెట్రోల్ బంక్ వద్ద స్టామ్ వాటర్ డ్రెయినేజీ పనులు

» మైలవరం చిన దళితవాడలో.. సిమెంట్ రోడ్ల పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జిల్లావ్యాప్తంగా పలుశాఖల పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచారు. మైలవరం చిన్న దళితవాడలో రూ.60 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కృష్ణాజిల్లా మచిలీపట్నం సర్కిల్ పంచాయతీరాజ్ అధికారులు టెండర్లు పిలిచారు. జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) గ్రాండ్ ద్వారా ఈ పనులు చేపట్టనున్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామంలో ఎన్‌హెచ్-65 నుంచి నవీపోతవరం సీబీఆర్ అకాడమి రోడ్డు నిర్మాణానికి రూ. 77.03 లక్షల వ్యయంతో పంచాయతీ రాజ్ అధికారులు టెండర్లు పిలిచారు. వీరులపాడు మండలం కొణతనపల్లి గ్రామంలో గంగా భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం జిల్లా దేవదాయశాఖ అధికారులు టెండర్లు పిలిచారు. రూ.73.59 లక్షల వ్యయంతో ఈ ఆలయాన్ని తిరిగి పునర్నిర్మించనున్నారు. విజయవాడ నగరంలో పీవీపీ మాల్ రోడ్డు నుంచి జమ్మిచెట్టు సెంటర్ వరకు తిరిగి అక్కడి నుంచి చెన్నుపాటి పెట్రోల్ బంక్ వరకు వరద నీటి మళ్లింపు కాలువ స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీ నిర్మాణం కోసం విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు రూ.1.12 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. నగరంలోని 16వ డివిజన్ పరిధిలో బాలాజీ నగర్ టాయిలెట్స్ సంపు కమ్ పంప్ హౌస్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనుల కోసం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రూ.1.50 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు.

బాధితులపైనే కేసుపెడతారా?

» తిరువూరు స్టేషన్ ఎస్ఐ పై ఎమ్మెల్యే ఆగ్రహం



స్టేషన్‌లో సీఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇంటిపై దాడికి యత్నించిన వారిపై ఎటువంటి కేసునమోదు చేయకుండా, ఆత్మరక్షణ ప్రయత్నంలో ఒక వ్యక్తికి గాయమైతే హత్యాయత్నం కేసు నమోదు చేస్తారా.. కేసుతో సంబంధంలేని మహిళల్ని రాత్రి వేళ స్టేషన్‌లో ఉంచుతారా.. అంటూ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి స్టేషన్‌కు వెళ్లి ఎమ్మెల్యే ఎస్ఐ కేవీజీవీసత్యనారాయణ వ్యవహారశైలిని తప్పుబట్టారు. ఎస్ఐ వచ్చేవరకు కదిలేది లేదని స్టేషన్‌లోనే భీష్మించారు. సమాచారం అందుకున్న సీఐ గిరిబాబు స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ వరంగల్ వెళ్లారని సర్ది చెప్పారు. ఇదిలా ఉంటే.. నియోజకవర్గంలో టీడీపీ వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. వార్డు, పట్టణ, గ్రామ, మండల నూతన కమిటీల ఏర్పాటు ఏకపక్షంగా జరిగాయని తీవ్ర ఆగ్రహంతో ఉన్న పార్టీ కేడరు అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించిన కార్యకర్తపై దాడులకు పాల్పడటం వర్గపోరుకు మరింత ఆజ్యం పోసింది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల వైసీపీకి చెందిన కొందరు సోషల్ మిడియాలో ముఖ్యమంత్రితో పాటు, ప్రజా ప్రతినిధుల్ని కించపర్చేలా పోస్టింగులు, వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై నూతనంగా ఎంపికైన కమిటీ ఎందుకు నోరుమెదపరని, టీడీపీ కార్యకర్త చిల్లపల్లి రామకృష్ణ సోషల్ మిడియాలో ప్రశ్నించారు. దీంతో టీడీపీ కార్యకర్త కె.సుమిత్‌సాయి, పానుగంటి వెంకట్, మరికొందరితో కమిటీని ప్రశ్నిస్తావా అంటూ మంగళవారం రామకృష్ణ ఇంటికి వెళ్లి దాడికి ప్రయత్నించగా, ఆయన గాజు బాటిల్‌ను విసరడంతో ఒకరికి గాయమైంది. ఘటనపై ఎస్ఐ రామకృష్ణపై కేసు నమోదు చేశారు. నిందితుడు లేకపోవడంతో ఆతడి తల్లి, సోదరిని స్టేషన్‌కు పిలిపించి రాత్రి వరకు ఉంచినట్టు సమాచారం అందడంతో ఎమ్మెల్యే స్టేషన్‌కు వెళ్లారు. ఎస్ఐ వ్యవహార శైలి బాగాలేదని, సీఐకి ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని సీఐ పేర్కొనడంతో వివాదం సద్దుమణిగింది.

నియోజకవర్గ టీడీపీలో వర్గపోరు..

నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో వర్గపోరు రోజురోజుకు తీవ్రమవుతోంది. వార్డు, పట్టణ, గ్రామ, మండల కమిటీలను ఏకపక్షంగా వేశారనే ఆరోపణలు నాయకుల్లో, కార్యకర్తల్లో వినిపిస్తున్నది. దీర్ఘకాలంగా పార్టీకోసం పనిచేసిన వారిని పక్కన పెట్టి, పార్టీ కష్టకాలంలో కనిపించకుండా పోయిన కొందరికి పదవులు కట్టబెట్టారని తెలుగుతమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ కమిటీలపై తీవ్ర అసంతృప్తిని కొందరు సీనియర్లు వ్యక్తం చేస్తున్నారు.

'టెండాల్ కం డ్రైవర్' కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): యంత్రపు నావ, బోటులో చేపల వేటపై ఏడాదిపాటు 'టెండాల్ కం డ్రైవర్' కోర్సు చేసేందుకు ఏపీ, తెలంగాణ, పుదుచ్చేరిలకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ ఎస్.అంజలి తెలిపారు. దరఖాస్తుకు సంబంధిత సర్టిఫికెట్ల నకళ్లు జత చేసి, ఆగస్టు7లోగా జిల్లాల మత్స్యశాఖ అధికారుల కార్యాలయాల్లో ఇవ్వాలని, లేదా నేరుగా కాకినాడలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆగస్టు 22న ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఏపీ ట్రాన్స్‌కో షేర్ హోల్డర్ల మార్పు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌కో షేర్ హోల్డర్లను మార్పు చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలు చేశారు. గతంలో సంస్థ చైర్మన్- మేనేజింగ్ డైరెక్టర్లతో సహా మిగిలిన బోర్డు డైరెక్టర్లకు హోదాతో కాకుండా వ్యక్తిగత పేర్లతో షేర్లు ఉండేవి. తాజాగా వ్యక్తిగత పేర్లపై కాకుండా బోర్డు యాజమాన్యంలో సీఎండీ, జేఎండీ డైరెక్టర్ల హోదాలతో షేర్లను కేటాయిస్తారు. దీనివల్ల బోర్డు యాజమాన్యంలోని అధికారులు బదిలీ అయినా - ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా ఉంటాయి.

జాయింట్ ఎల్పీఎంలకు ఉచితంగా సబ్ డివిజన్

» మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): జాయింట్ ల్యాండ్‌పార్సిల్ (ఎల్‌పీఎమ్)లో ఉన్న రైతులు ఉచితంగా సబ్‌డివిజన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించింది. డిసెంబరు 31 వరకు జాయింట్ ఎల్‌పీఎమ్‌ల ఆన్‌లైన్ సబ్ డివిజన్ కోసం వచ్చే దరఖాస్తులకు ఫీజును మినహాయిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి జీవో జారీ చేశారు. ఫీజు మినహాయింపునిస్తూ ఈ ఏడాది జనవరి 1న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ గడువు ముగియడంతో దానిని పొడిగించింది. జాయింట్ ఎల్‌పీఎమ్ ఉన్న వేలాది మంది రైతులు సబ్‌డివిజన్ కోసం ఇంకా దరఖాస్తు చేసుకోలేదు. తమకూ ఫీజు మినహాయింపును వర్తించేయాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గడువు పొడిగిస్తూ రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ సభ్యులుగా జాన్‌ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జులై 23 (ఆంధ్రజ్యోతి): 'సికింద్రాబాద్ బెంచ్ రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌గౌరవ సభ్యులుగా (టెక్నికల్)జి.జాన్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1986 బ్యాచ్ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్(ఐ.ఆర్.టి.ఎస్)కు చెందినజాన్ ప్రసాద్ ఇప్పటి వరకు అమరావతి బెంచ్ లోని రైల్వేక్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. గతంలో ఆయన దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పి.సి.సీఎం)గా, నైరుతి రైల్వేలో ప్రిన్సిపల్‌చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ (పి.సి.ఓ.ఎం)గా, దక్షిణమధ్య రైల్వే పరిధి హైదరాబాద్,సికింద్రాబాద్‌డివిజన్లలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. చెన్నైలోని సదరన్ రీజియన్‌కి సి.ఓ.ఎన్.సి.ఓ.ఆర్. (కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) చీఫ్ జనరల్ మేనేజర్‌గాసేవలుఅందించారు. రైల్వేలో వాణిజ్య, ఆపరేషన్, క్లెయిమ్‌ల పరిష్కారాలలో జాన్ ప్రసాద్‌కు విశేషఅనుభవం ఉంది. రైల్వేలో పి.సి.సిఎంగా ఆయన మొబైల్ యాప్ ద్వారా అన్‌రిజర్వ్ టికెటింగ్ వ్యవస్థ డిజిటలైజేషన్ ప్రవేశపెట్టడానికి కృషి చేశారు. గతంలో ఆయన జర్మనీలో ఏడాదిపాటు ఆపరేషనల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లో స్వల్పకాలిక మల్టీ-మోడల్ లాజిస్టిక్స్ మాడ్యూల్‌ను పూర్తి చేశారు

విన్నపాలు వినవలె..!

(5వ పేజీ తరువాయి)

సరిదిద్దాల్సిన అవసరం ఉంది.

కైకలూరుకు ఏలూరు దూరమే..

కృష్ణాజిల్లాకు దగ్గరలో ఉన్న కైకలూరు, ముదినేపల్లి మండలాలను ఏలూరు జిల్లాలోకి తీసుకెళ్లారు. ఈ మండలాలను దూరం చేయటం వల్ల భౌగోళిక విచ్ఛిన్నం జరిగింది. ఇక్కడి ప్రజలకు దూరాభారాన ఉన్న ఏలూరు వెళ్లడం ఇబ్బందిగా మారింది. దగ్గరగా ఉన్న మచిలీపట్నం కాకుండా ఏలూరు వెళ్లిరావడం వారికి అసౌకర్యంగా మారింది.

నూజివీడు సంగతేంటి?

ఒకప్పుడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో అంతర్భాగంగా ఉన్న నూజివీడును కూడా ఏలూరు జిల్లాలో కలిపారు. మచిలీపట్నానికి దూరంగా ఉన్న నూజివీడును ఏలూరులో కలపటం సబబే అయినా.. ఈ అంశాన్ని స్థానికులు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. తమను కృష్ణాలోనే కలపాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నూజివీడు వచ్చినపుడు ప్రజలు తమ వినతిని ఆయనకు చెప్పుకొన్నారు. నూజివీడును కృష్ణాజిల్లాలో విలీనం చేస్తానని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ, నూజివీడును కృష్ణాజిల్లా కంటే ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయటమే మంచిదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విస్తరిస్తున్న విజయవాడకు ఈ ప్రాంతం దగ్గరగా ఉండటమే ఇందుకు కారణం

పదోన్నతుల రగడ

(5వ పేజీ తరువాయి)

వ్యవహారం తేలట్లేదు. సీఆర్‌డీఏ కమిషనర్ సానుకూలంగా స్పందించినప్పటికీ ఫైల్ మాత్రం ఆయన దగ్గరకు రావట్లేదని తెలుస్తోంది. ఈ పదోన్నతుల వ్యవహారాన్ని ఏ అధికారి అడ్డుకుంటున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్న సీఆర్‌డీఏ అధికారుల వ్యవహారశైలిపై విమర్శలు వస్తున్నాయి.

ఐటీఐలో తొలిరోజు 190 మందికి అడ్మిషన్లు

భారతీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : 2025-26/27 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి బుధవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన రెండవ విడత కౌన్సిలింగ్‌లో తొలిరోజు 217 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 190 మంది వివిధ ట్రేడ్లలో అడ్మిషన్లు పొందినట్టు ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నమ్మించి మోసగించిన ముగ్గురిపై కేసు

విద్యాధరపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గొల్లపూడికి చెందిన మైనింగ్ వ్యాపారి, చీరాల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి, సెంట్రల్ జోన్ కన్వీనర్ అనిల్ కుమార్ అలాతో వ్యవసాయ బయో ఉత్పత్తుల తయారీ, విక్రయాల వ్యాపారంలో భారీగా పెట్టుబడులు పెట్టించి మోసం చేసిన ముగ్గురిపై బుధవారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపూడిలోని వెంకట నివాస్ ఎలైట్ అపార్టుమెంట్‌లో అనిల్‌కుమార్ అలా నివాసం ఉంటున్నాడు. ఇతను మైనింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న సీహెచ్ కాంతారావు, మౌలానా రఫీలు బాధితుడిని కలిసి వ్యవసాయ బయో ఉత్పత్తుల తయారీ, విక్రయాల వ్యాపారం గురించి నమ్మకంగా చెప్పారు. వారి మాటలు నమ్మిన అనిల్ కుమార్ తాను స్లీపింగ్ పార్టనర్‌గా ఉంటానని చెప్పాడు. కాంతారావు, రఫీలు అనిల్ కుమార్‌కు రాయుడు కిషోర్‌ను పరిచయం చేసి బయోఫార్ములాల రూపకల్పన, ఉత్పత్తి నిర్వహణ బాధ్యతలను కిషోర్ చూసుకుంటాడని చెప్పారు. వారి మాటలపై నమ్మకంతో అనిల్‌కుమార్ 2019 ఆగస్టు 9న భాగస్వామ్య ఒప్పందం చేసుకుని ఉత్పత్తి కేంద్రాన్ని అద్దెకు తీసుకున్నారు. ఎస్ స్కేర్ కార్పొరేషన్ సైన్స్ పేరుతో ఓ ప్రైవేటు బ్యాంక్‌లో ఖాతా ఓపెన్ చేశారు. 2019 అక్టోబరు నుంచి 2021 మే వరకు బాధితుడు అనిల్ కుమార్ మొత్తం పెట్టుబడి రూ.16,90,200లు బ్యాంక్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. వ్యాపారం ప్రారంభించినప్పటి నుంచి ముగ్గురు లాభనష్టాల లెక్కలు అనిల్ కుమార్‌కు తెలియపరచకుండా పక్కన పెట్టేశారు. కనీసం ఖర్చుల వివరాలు, బ్యాంకు లావాదేవీలు, పన్నుల వివరాలు చెప్పలేదు. కొన్నిరోజుల తరువాత మరో రూ.40లక్షలు పెట్టుబడి పెట్టాలని ముగ్గురూ అనిల్‌కుమార్‌పై ఒత్తిడి చేశారు. బాధితుడు ఆరా తీయగా భాగస్వాముల అనుమతి లేకుండా కాంతారావు నెలకు లక్ష వ్యక్తిగత అవసరాల కోసం తీసుకుని వాడుకున్నారని, ప్రభుత్వానికి పన్నులు చెల్లించలేదని గుర్తించారు. మౌలానా రఫీ ఓ ప్రముఖ సీడ్స్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తూ కంపెనీ ఉత్పత్తులను మహారాష్ట్రలో విక్రయించి సొమ్ము చేసుకున్నాడని తెలిసింది. ఈ విషయంపై అనిల్‌కుమార్ రఫీని ప్రశ్నించగా తాను కంపెనీ తరపున తీసుకున్న అప్పునకు నెలవారీ వడ్డీ తీసుకుంటున్నానని చెప్పాడు. రాయుడు కిషోర్ కంపెనీ తరపున ముడిసరుకులు కొనుగోలుచేసి వాటిని ఇతర సంస్థలకు విక్రయించి లాభాలు పొందాడని తెలిసి ప్రశ్నించగా, అప్పులు తీర్చే వరకు ఇలానే చేస్తానని బెదిరించాడు. 2020లో భవానీపురం హోటల్‌లో జరిగిన సమావేశంలో తనకు రావాల్సిన మొత్తం డబ్బులు ఆ ఏడాది సెప్టెంబరులో చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నా వారు అనిల్ కుమార్‌కు డబ్బులు ఇవ్వలేదు. 2021లో బాధితుడు కరోనా బారిన పడి ఆ ముగ్గురిని డబ్బులు ఇవ్వాలని కోరగా, వారు తప్పించుకుని తిరుగుతున్నారు. వ్యాపారానికి పెట్టిన పెట్టుబడి, తన వాటా అడిగితే బెదిరించి తనకు ఎలాంటి హక్కులు లేవని చెబుతున్నారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీలినీడలు!

(5వ పేజీ తరువాయి)

నోటీసులు జారీ చేయడంతో భారత్ సాల్ట్ యాజమాన్యం ఈ ఏడాది ఉప్పు ఉత్పత్తి చేయకుండా నిలిపివేసింది. దీంతో ఇక్కడ పనిచేసే మూడు గ్రామాలకు చెందిన రెండు వేల మందికి పైగా కార్మికులకు ఈ ఏడాది డిసెంబరు నుంచి పని చేయడానికి అవకాశం లేకుండా పోయింది. మచిలీపట్నంలో ఉన్న ఒక్క పరిశ్రమలో ఈ ఏడాది పనులే ప్రారంభించకపోవడంతో ఈ ఫ్యాక్టరీ భవిష్యత్తులో కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఉప్పు ఉత్పత్తికి తప్ప.. ఎందుకూ పనికిరాని భూములు

భారత్ సాల్ట్‌కు ఇచ్చిన 6,500 ఎకరాల భూమి సముద్రానికి, సముద్రపు కరకట్టకు మధ్యలో ఉంటుంది. ఈ భూముల్లో సహజసిద్ధంగా మడ అడవులు పెరుగుతూ ఉండేవి. 2002 సంవత్సరం, అంతకు ముందు టైగర్ రొయ్యల సాగు లాభసాటిగా ఉండటంతో పాటు, సముద్రం నుంచి స్వచ్ఛమైన నీరు అందుతుందనే కారణంతో ఈ భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకుని రొయ్యల చెరువులుగా మార్చి వేయడం ప్రారంభించారు. దీంతో అప్పటి మంత్రి నడకుదిటి నరసింహారావు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ భూముల ఆక్రమణ అంశాన్ని తీసుకువెళ్లారు. ఈ భూములను భారత్ సాల్ట్ కంపెనీకి లీజుకు ఇచ్చారు. దీంతో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు కొంత మేర బ్రేక్ పడింది. గత 23 సంవత్సరాలుగా ఇక్కడ ఉప్పు ఉత్పత్తి జరుగుతూ వస్తోంది. వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఈ భూములను స్వాధీనం చేసుకున్నట్టుగా నోటీసులు జారీ చేయడంతో భారత్ సాల్ట్ ఫ్యాక్టరీ మూతపడినంతపనైంది. బందరు పోర్టు పనులు జరుగుతున్న సమయంలో పోర్టు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి భారత్ సాల్ట్ కంపెనీకి ప్రభుత్వం లీజుకు ఇచ్చిన భూములను ఇస్తామని గత ప్రభుత్వం హయాంలో చెబుతూ వచ్చారు. ఈ భూముల్లో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీలులేకున్నా ఈ రకమైన ప్రచారం చేసి భారత్ సాల్ట్ కంపెనీని ఖాళీ చేయించే పనిని చేపట్టారు. ఈ ప్రాంతంలోని భూములు ఉప్పు ఉత్పత్తికి తప్ప మరే ఇతర పరిశ్రమల స్థాపనకు పనికిరావని ఇటీవల సాంకేతిక నిపుణులు చేసిన సర్వేలో నిర్ధారించారు. కూటమి ప్రభుత్వం ఇక్కడి ప్రజల అవసరాలు గుర్తించి వచ్చే ఏడాదికైనా ఇక్కడ ఉప్పు ఉత్పత్తి పనులు ప్రారంభించేందుకు అనుమతులు ఇచ్చి తమకు ఉపాధి కల్పించాలని పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప, కోన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

వీరమ్మకు ఆషాఢ సారె

ఉయ్యూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నవయువత ఫ్రెండ్స్ సర్కిల్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీరమ్మతల్లికి బుధవారం ఆషాడ సారె సమర్పించారు. అన్నే బాబూరావు బజారు నుంచి మేళ తాళాలతో వంద మందికిపైగా మహిళలు పసుపు కుంకుమ, చలిమిడి, చీర, స్వీట్లతో ఊరే గింపుగా బయలుదేరి అమ్మవారి గుడికి చేరుకుని సారె సమర్పించారు. కమిటీ నాయకుడు పడమట వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.



వీరమ్మకు సారె సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

రోడ్లపైనే మురుగు!

- ఆకునూరులో సర్వీసు రోడ్లపైకి వదులుతున్న ఇళ్లలో మురుగు
- అసౌకర్యానికి గురవుతున్న పాదచారులు, వాహనదారులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు.. పాలకులు



ఆకునూరులో సర్వీసు రోడ్డుపై ఇళ్లలో మురుగు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఆకునూరులో హైవేకు ఇరువైపులా ఉన్న సర్వీసురోడ్లు మురుగు కాల్వల్లా తయారవడంతో రోడ్లపై వెళ్లేవారికి తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. గ్రామంలో సర్వీసు రోడ్డు పక్కన డ్రైయినేజీ సౌకర్యం లేకపోవడంతో అక్కడ నివసించే వారి ఇళ్లలోని మురుగు సర్వీసు రోడ్లపైకి వదులుతున్నారు. దీంతో ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లపైన మురుగు నీరు ప్రవహిస్తూ మురుగు కాల్వలను తలపిస్తున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారులు, సర్వీసు రోడ్ల వెంబడి డ్రైయినేజీ సౌకర్యం కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలం కావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో లేని చిన్న చిన్న ప్రైవేట్ రోడ్లను సీసీ రోడ్లుగా మార్చుతున్నారే కాని డ్రైయినేజీ సౌకర్యం కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సర్వీసు రోడ్ల వెంబడి డ్రెయినేజి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



పర్వతనేని సుభాష్‌బాబును సన్మానిస్తున్న విద్యాసాగర్, మూల్పూరి ఉపేంద్ర

పెనమలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో రకాలుగా సమాజానికి చేయూతనందిస్తున్న లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ పేర్కొన్నారు. బుధవారం పోరంకిలో స్టేట్ ఏరియా లీడర్ మూల్పూరి ఉపేంద్ర ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా ఎంపికై స్వదేశానికి తిరిగి వచ్చిన పర్వతనేని సుభాష్‌బాబు సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ లో మూడు దశాబ్దాలపాటు ఉద్యోగిగా నిబద్ధతతో సేవలందించిన సుభాష్ బాబు ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా ఎంపికవ్వడం శుభపరిణామమన్నారు. సుభాష్‌బాబు పట్టుదల, క్రమశిక్షణతో పనిచేసేవారని తెలిపారు. వాలంటరీ రిటైరుమెంట్ తీసుకొని రెండు దశాబ్దాలపాటు పేదల అభ్యున్నతి కోసం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆయన సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు. సుభాష్‌బాబు సేవలను వక్తలు కొనియాడారు. ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణ, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా గవర్నర్లు ఆంజనేయులు, పాపారావునాయుడు, మాజీ గవర్నర్ రమణరావు పాల్గొన్నారు.



గుర్రపు డెక్క తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఉయ్యూరు, జూలై 23 (ఆంధ్ర జ్యోతి) : చినఓగిరాల వంతెన వద్ద పుల్లేరు కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపునకు బుధవారం ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. పుల్లేరు కాల్వలో ఎగువ నుంచి డెక్క, తూటికాడ నీటి ప్రవాహంలో కొట్టుకువచ్చి వంతెన వద్ద అరకిలో మీటరు మేర పేరుకుపోయింది ఈ పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు పనులు చేపట్టారు.

శివాలయంలో మాస శివరాత్రి పూజలు



హనుమాన్‌జంక్షన్, జూలై 23 (ఆంధ్ర జ్యోతి) : బాపులపాడులోని భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు,పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సతీష్‌శర్మ స్వామి వారికి విశేష ద్రవ్యాలతో రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నందీశ్వరుడికి పంచామృతా భిషేకం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నా, కమిటీ సభ్యులు తమిరి రమేష్‌కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య తదితరులు పర్య వేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పునాదిపాడు టీడీపీ అధ్యక్షుడిగా సంజీవరావు

కంకిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పునాదిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కవిరి సంజీవరావును నియమించామని క్లస్టర్ కన్వీనర్ దేవినేని రాజా తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడు తూ, గతంలో పార్టీ అధ్యక్ష పదవి కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష పదవిని పోటీ ఎక్కువగా ఉండటంతో అధ్యక్ష పదవిని వాయిదా వేయటం జరిగిందని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచనల మేరకు ఐవీఆర్ఎస్ పద్ధతిని వినియోగించటం జరిగిందన్నారు. ఈ పద్ధతిలో కవిరి సంజీవరావుకు గ్రామస్థులు మద్దతు తెలపడంతో ఆయన పేరును అధిష్టానం ఖరారు చేసినట్లు దేవినేని రాజా చెప్పారు. పార్టీ గ్రామాధ్యక్షుడిగా కవిరి సంజీవరావు, ఉపాధ్యక్షుడిగా లోయా పూర్ణచంద్రరావు, ప్రధాన కార్య దర్శిగా జంపాన వెంకటేశ్వరరావు, కోశాధికారిగా బండారు వెంకటేశ్వర రావు, కార్యదర్శులుగా కొడాలి సాయికుమార్, టి.రామకృష్ణ, జె. శ్రీనివాసరావు, డి. మస్తాన్, మట్టా ఏలియ తదితరులను నియమించారు.

సీపీఆర్‌పై అవగాహన

ఉయ్యూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్, హోప్ మల్టిస్పె షాలిటీ హాస్పిటల్ ఆధ్వ ర్యంలో సీపీఆర్ (కార్డియో పల్మనరి రెసిస్టెషన్)పై శ్రీశ్రీనివాస విద్యాసంస్థల్లో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ అంటే ఏమిటి, హఠాత్తుగా స్పృహ కోల్పోయిన వారికి సీపీఆర్ చేసి ఏవిధంగా వారిని రక్షించ వచ్చనేది క్రిటికల్ కేర్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ జ్యోతి డెమో ద్వారా తెలియ జేశారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మీనాకుమారి, విద్యాసంస్థల డైరెక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై డెమో ఇస్తున్న శ్రీశ్రీనివాస స్కూల్ విద్యార్థులు

మహిళను అవమానించిన వారిపై కేసు

ఉయ్యూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళను వేధింపులకు గురిచేసి, అవమానించిన చిట్టూరి జగదీశ్వరశంకర్, చిట్టూరి రూపపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఉయ్యూరు సీఐ రామారావు తెలి పారు. వంగర లక్ష్మి శివాలయం వీధిలో నివసించే చిట్టూరి జగదీశ్వర్ ఇంటిలో పని చేస్తున్న సదర్భంగా ఆమెపై దొంగతనం మోపి, బంగారం, బ్యాంకు లోఉన్న డబ్బును దౌర్జన్యంగా తీసుకుని వేధింపులకు గురి చేశారని మంగళవారం చేసిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి: డీపీవో



కంకిపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి జె. అరుణ అన్నారు. పునాదిపాడులో బుధవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డీపీవో అరుణ మాట్లాడుతూ, వీధుల్లో చెత్త వేయకుండా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజు పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారా లేదా అని నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పారిశ్రామిక రంగం అభివృద్ధి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



ప్రసాదంపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం ప్రసాదంపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గ్రామం లోని ఏలూరు కాలువ కట్ట, మధ్యకట్ట, గోపాల్ కట్ట ప్రాంతాల్లో పాల్గొని గత ఏడాది కాలంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ముందు చూపుతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేలా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గన్నవరం ఐటీ పార్కులో కొత్తగా ఐటీ సంస్థలు ఏర్పాటు అవుతున్నాయని, వీటికి తోడు రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలి రావడంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని యార్లగడ్డ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్నాల గంగారత్నం, యువ నాయకులు సర్నాల బాలాజీ, బొప్పన హరికృష్ణ, గుజ్జర్లపూడి బాబూరావు, గూడవల్లి నరసయ్య, పరుచూరి నరేష్, కోనేరు సందీప్, మండల అధ్యక్షులు గొడ్డళ్ల చిన్నరామారావు, కొల్లా ఆనంద్, నెక్కంటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాల్వ కట్ట వాసుల సమస్యలు పరిష్కరిస్తా..

పెనమలూరు: కాల్వ కట్టలపై నివాసముంటున్న ప్రజల స్థితిగతులు తనకు తెలుసని, వారి సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. బుధవారం వీఆర్ సిద్ధార్థ కళాశాల వంతెన ఎదురు తాడిగడప శ్రీనివాసనగర్ కట్టపై సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాల్వ కట్టలపై తాగునీరు, డ్రైనేజీ, రోడ్లకు సంబంధించిన కొద్దిపాటి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులకు తగు ఆదేశాలిస్తామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి , ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ప్రజలు మద్దతు పలకాలని కోరారు. ఏడాది పాలనలో టీడీపీ కూటమి చేసిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, నల్లా చంటి పాల్గొన్నారు.



శ్రీనివాసనగర్ కాల్వకట్టపై స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సూపర్ సిక్స్ హామీల అమలు

ఉయ్యూరు : ఎన్నికల సందర్భంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల అమలుకు సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉయ్యూరు 19వ వార్డులో పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తెలి యజేసి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉయ్యూరు చైర్మన్ వి. సత్యనారాయణ, మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుర్నాధరావు, జగరోతు నాగరాజు, కుటుంబరావు, ఆల్‌రియాజ్, నరేశ్, వెంకటేశ్వరరావు పలియాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో ఆకునూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు తెలియజేసి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ గ్రామాధ్యక్షుడు వెల గపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ గోలి వసంతకుమార్ పాల్గొన్నారు.
- ఆనందపురంలో ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాలు తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన కోన కోటేశ్వరమ్మకు సీఎంఆర్ ఎఫ్ చెక్కు అందజేశారు. యూనిట్ ఇన్‌చార్జ్ కోటేశ్వరరావు, చందు, బాషా, రత్నవేణి తదితరులు పాల్గొన్నారు.

డెక్క, తూడు తొలగింపు

ఉంగుటూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుడమేరులో నీటి ప్రవాహం పెరగటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వరద నీటికి తీవ్ర అడ్డంకిగా మారిన గుర్రపుడెక్క, తూడులను తొలగించే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ప్రధానంగా వంతెనలు, చప్టాలవద్ద దట్టంగా అల్లుకుపోయిన గుర్రపుడెక్క, తూడులను జేసీబీలు, ప్రొక్లెయిన్ల సాయంతో తొలగిస్తున్నారు. తేలప్రోలు- ఉయ్యూరు ప్రధాన రహదారిపై ఉంగుటూరు-లంకపల్లి గ్రామాలమధ్య బుడమేరు చప్టా వంతెనవద్ద మేట వేసుకుపోయిన గుర్రపుడెక్క తూడు లను తొలగించే పనులను గత మూడురోజులుగా నిర్వహిస్తున్నారు. మరో రెండు రోజుల్లో సదరు పనులు పూర్తవుతాయని, ఆతర్వాత కొయ్యగూరపాడు వంతెన వద్ద డెక్క, తూడు తొలగించే పనులు చేపడతామని ఏఈఈ ఉదయ్‌కిరణ్ తెలిపారు.



డెక్క తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ఉయ్యూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ట్రూ అప్ చార్జీల వడ్డింపు, స్మార్ట్ మీటర్ల బిగింపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం మోపేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.శినాగేంద్రం అన్నారు. ట్రూఆప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు బిగించాడానికి వ్యతిరేకంగా బుధవారం శ్రామిక భవన్‌లో సదస్సు నిర్వహించారు. ఆగస్టు 5న తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ పట్టణ కమిటీ అధ్యక్షుడు బి.రాజేశ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సీనియర్ నాయకుడు చంద్రమౌళి, మహిళా జిల్లా సహాయ కార్యదర్శి బి.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : స్మార్ట్ మీటర్లు బిగించడం వెనుక విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగివుందని, వాటిని ఇళ్లకు బిగించకుండా ప్రజలు వ్యతిరేకించాలని ప్రజావేదిక నాయకులు టీవీ లక్ష్మణస్వామి అన్నారు. ఉంగుటూరులోని కామ్రేడ్ మానికొండ సూర్యావతి శ్రామికభవనంలో బుధవారం రైతుసంఘం మండల కార్యదర్శి మాగంటి సాంబశివరావు అధ్యక్షతన స్మార్ట్ మీటర్లు వద్దు- పాత మీటర్లే ముద్దు -ట్రూ ఆఫ్‌చార్జీలు రద్దు అనే నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు, ఉంగుటూరు మాజీ సర్పంచ్ గుండె రవికుమార్, వెన్నూతల సర్పంచ్ టీవీ రామ్మోహనరావు, సీఐటీయూ నాయకులు కడవకొల్లు రామరాజు, మహ్మద్ గాలీబ్, చంటి, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

శభాష్ ఎమ్మెల్యే సార్..

● బోడె ప్రసాద్‌కు స్థానికుల ప్రశంస





కానూరు మెయిన్ రోడ్డులో వర్షపు నీరు నిలవడంతో ఆంధ్రజ్యోతిలో బుధవారం 'రోడ్డుపైనే నీరు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ రాత్రి పది గంటల వరకు ఉండి కెనడీ స్కూల్ వద్ద డ్రెయిన్‌లో పూడిక తొలగింపును పర్యవేక్షించారు. నీరు ప్రవహించేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే పనితీరును స్థానికులు ప్రశంసించారు. **- ఆంధ్రజ్యోతి, కానూరు**



జి.కొండూరు మండలం హెచ్ ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై ఉన్న డైవర్షన్ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

మహోధృతం

"ఎన్టీఆర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వైరా, కట్టలేరు, మున్నేరు, బుడమేరు తదితర ప్రధాన కాలువలతో పాటు అంతర్గత వాగులు కూడా పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం ప్రమాదం లేనప్పటికీ, మరికొన్ని రోజులు భారీ వర్షాలు కొనసాగితే ఇబ్బందులు తప్పవు. కట్టలేరు కారణంగా బుధవారం 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుడమేరుకు 5వేల క్యూసెక్కుల వరద వచ్చింది. పాలేరు, ఏనుగుగడ్డ వాగు, కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి."

- ఆంధ్రజ్యోతి, కంచికచర్ల /ఇబ్రహీంపట్నం / జి.కొండూరు / మైలవరం / రెడ్డిగూడెం /గంపలగూడెం

- కట్టలేరుకు పోటెత్తిన వరద
- డైవర్షన్ రహదారిపై నిలిచిన రాకపోకలు
- 20 గ్రామాలకు రాకపోకలు బంద్
- కోతులవాగు, పులివాగు, కొండవాగు నుంచి వరద నీరు
- బుడమేరుకు పెద్ద ఎత్తున చేరుతున్న వరద
- వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద 5,500 క్యూసెక్కుల నీరు
- బుడమేరు డైవర్షన్ చానెల్, బీడీసీ ద్వారా కృష్ణా నదిలోకి
- హెచ్ ముత్యాలంపాడు వద్ద డైవర్షన్ రహదారిపై వరద ప్రవాహం

భారీ వర్షాలతో ఎన్టీఆర్ జిల్లాలో పొంగుతున్న వాగులు, వంకలు

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని వాగులు, వంకలు పొంగాయి. గంపలగూడెం మండలం తోటమూల-వినగడప రహదారిలో కట్టలేరు డైవర్షన్‌పై వరద నీరు భారీగా ప్రవహించడంతో 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గంపలగూడెంకు చేరేందుకు ప్రజలు 30 కిలోమీటర్ల అదనపు దూరం ప్రయాణించాల్సి వచ్చింది. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీవో బాబురావు, తహసీల్దార్ వీ రాజకుమారి, ఎస్సై శ్రీనివాసరావు పరిస్థితులను పర్యవేక్షించారు. మైలవరం నియోజకవర్గంలో కోతుల వాగు, కొండవాగు, పులివాగులకు వరద పోటెత్తి, బుడమేరుకు చేరింది. హెచ్ ముత్యాలంపాడు వద్ద బుడమేరు డైవర్షన్ రహదారిపై వరద నీరు చేరడంతో వాహన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. వరద తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు పునరుద్ధరించారు. బుడమేరు పరివాహక ప్రాంతంలోని పంట చెరువులకు సాగునీరు సప్లై చానల్స్ ద్వారా చేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాగాణి సాగుకు వర్షం ఊతమిచ్చింది. అయితే పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుడమేరు ఎగువ నుంచి వచ్చిన వరద నీరు, పట్టిసీమ నుంచి పోలవరం కాలువలో వచ్చిన నీటితో కలిసి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద 5.3 అడుగుల వరద నీరు ఉంది. మొత్తం 5,500 క్యూసెక్కుల వరద నీటిని బుడమేరు వరద మళ్లింపు కాలువ (బీడీసీ) ద్వారా కృష్ణా నదికి పంపుతున్నారు. 15వేల క్యూసెక్కుల వరకు వరద నీటిని బీడీసీ ద్వారా మళ్లించే అవకాశం ఉందని, ఆ పరిమితి దాటితే గేట్లు ఎత్తి కిందకు పంపుతామని ఏఈ వెంకటేష్ తెలిపారు. కొండవాగు పొంగి బుడమేరులో కలవడంతో బాలయోగినగర్, సూరిబాబు పేట వంటి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండవాగు సమీపంలోని ఈ ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపైకి రాకపోవడంతో ఒక పూట రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెడ్డిగూడెం మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షంతో వాగులు పొంగాయి. నాగసానిపాటి వారి చెరువు సప్లై చానెల్‌కు వరద ఉధృతి పెరగడంతో రెడ్డిగూడెం-ఓబులాపురం రహదారిపై నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం వరకు పరిస్థితి అలాగే ఉండటంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెరువులు జలకళ సంతరించుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వరద పరిస్థితిని సమీక్షించారు.

నందిగామ డివిజన్‌లో..

కట్టలేరు, వైరా ఏరు, పాలేరుకు భారీ వరద వచ్చింది. నందిగామ కూడలి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణలో భారీ వర్షాల కారణంగా మునేటికి భారీ వరద రానుంది. వత్సవాయిలో రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. మూడు రోజులుగా భారీ వర్షాలతో యేనుగుగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఈ వాగు వెంబడి ఉన్న గ్రామాల రైతులు పొలాలకు వెళ్లలేకపోతున్నారు. చెవిటికల్లు వద్ద లక్ష్మయ్య వాగు పొంగడంతో కంచికచర్ల మార్గంలో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. వైరా ఏరు నందిగామ మండలం దాములూరు-వీరులపాడు మండలం పల్లెంపల్లి మధ్య కూడలి కాజ్‌వేపై నాలుగైదు అడుగుల ఎత్తున పొంగింది. అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన వంతెన ఉపయోగం లేకుండా పోయింది. వరదలో కాజ్‌వే మునిగిపోవడంతో రెవెన్యూ పోలీసు అధికారులు ఈ మార్గాన్ని మూసివేశారు. మునేటికి స్వల్పంగా వరద వచ్చినప్పటికీ, తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా వరద క్రమంగా పెరుగుతోంది. సోమవారం ఒక్క రోజే 138.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జగ్గయ్యపేటలో 25.2, పెనుగంచిప్రోలులో 64.2, నందిగామలో 79.6, వీరులపాడులో 76.4, కంచికచర్లలో 68.4, చందర్లపాడులో 25.6 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మొత్తం 477.4 మిల్లీమీటర్ల వర్షం కురిసినప్పటికీ, సగటున 68.2 మిల్లీమీటర్లు నమోదైంది. వర్షం వల్ల మెట్ట పంటలైన పెసర, మినుము, పత్తి, మొక్కజొన్న బాగా పెరుగుతున్నాయి. వరి నారుమళ్లు పుంజుకుంటున్నాయి. అయితే, మరింత వర్షం కురిస్తే పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కల్లేరు డైవర్షన్ రహదారిపై వెళుతున్న వరద నీరు, నాగసానిపాటి చెరువుకి వెళ్లే సప్లై చానల్‌లో రహదారిపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు, దాములూరు కూడలి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా ఏరు



ఈవీఎం గోదాము తనిఖీ చేస్తున్న డీఆర్వో లక్ష్మీ నరసింహం

ఈవీఎం గోడౌన్‌లో డీఆర్వో తనిఖీ

కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సాధారణ తనిఖీల్లో భాగంగా గొల్లపూడి మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచే గోదామును బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీ నరసింహం పరిశీలించారు. గోడౌన్‌కు వేసిన సీల్డ్‌లను, ఈవీఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉంటుందన్నారు. ఈవీఎం గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమేరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



ఆనందంతో స్వీట్లు పంచుకుంటున్న వర్క్‌షాపు ఉద్యోగులు

15 రోజుల సెలవు మంజూరుపై హర్షం

- స్వీట్స్ పంచుకున్న ఆర్టీసీ వర్క్‌షాపు ఉద్యోగులు

బస్టేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కడప, నెల్లూరు, విజయనగరం, విజయవాడ ఆర్టీసీ వర్క్‌షాపుల్లోని ఉద్యోగులకు ఏడాదికి 15 రోజులు సెలవులు ప్రకటించినందుకు ఆ 4 యూనిట్లలోని ఉద్యోగులు బుధవారం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. ఏపీఎస్ఆర్టీసీలో అన్ని కేటగిరిల్లోని ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి ఏడాదికి 15 రోజులు సాధారణ సెలవులు ఉంటాయని, అయితే ఎన్నో దశాబ్దాలుగా కడప, నెల్లూరు, విజయనగరం, విజయవాడకు చెందిన 4 వర్క్‌షాపుల ఉద్యోగులకు కేవలం ఏడాదికి 5 రోజుల సెలవు మాత్రమే ఇస్తున్న వైనం ఉంది. ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ చేసిన పోరాటం ఫలితంగా తాజాగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు 15 రోజులు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి, ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు

వైసీపీ నేతలపై కేసు నమోదు

పాయకాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై అభ్యంతరకరంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ఇద్దరు వైసీపీ నేతలపై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈనెల 21న స్థానిక వైసీపీ నేతలు ప్రశాంతినగర్ ప్రాంతంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఫొటోను అభ్యంతరకరంగా ఫ్లెక్సీలో ముద్రించారు. దీనిపై స్థానిక టీడీపీ నేతలు లబ్బా వైకుంఠం, దాసరి ఉదయశ్రీ మంగళవారం రాత్రి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఎంజీఎస్‌వై కింద 8 రోడ్లు మంజూరు

అమరావతి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన-3 బ్యాచ్-1 కింద 2024-25 సంవత్సరానికి సంబంధించి రోడ్ల నిర్మాణానికి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. 8 రోడ్లకు రూ.80.40 కోట్లు, మూడు వంతెనల నిర్వహణకు రూ.3.18 కోట్లు మంజూరుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఐదేళ్లపాటు కాంట్రాక్టర్లు ఈ రోడ్ల నిర్వహణను చేపట్టాల్సి ఉంటుంది.

ఉపాధి హామీలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- పనితీరు సరిగా లేని ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు
- వారంలో ఉద్యాన పంటల లక్ష్యాలను చేరుకోవాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శ్రామికులకు పని కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రతి మండలంలో పనితీరులో అట్టడుగున ఉన్న ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఉపాధి హామీ పథకం, అనుబంధ కార్యకలాపాలపై డ్వామా అధికారులు, సిబ్బంది, ఆర్డీవోలు, ఎంపీడీవోలతో వీడియా కాన్ఫరెన్సు నిర్వహించారు. శ్రామికులకు రూ.307 కనీస వేతనం కల్పించి ఆర్థిక ఊతమిచ్చేలా కృషిచేయాలని ఆదేశించారు. 2025-26కు గాను జిల్లాలో 80 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించామని, గతేడాది గణాంకాల ఆధారంగా ఈ ఏడాది మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా 3 వేల పంట కుంటలను నిర్మించాలనేది లక్ష్యం కాగా, వీటిలో నిర్మాణ దశలోని వాటిని త్వరగా పూర్తిచేయాలన్నారు. జల్ సంచాయ్ జన్ భాగీదరి ద్వారా జిల్లాలో వాన నీటి సంరక్షణకు చేపట్టిన కార్యక్రమాల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జిల్లాను ముందువరుసలో నిలపాలన్నారు. జిల్లాలో మంజూరైన వెయ్యి గోకుల షెడ్లకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించి పరిపాలన అనుమతులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో డ్వామా పీడీ ఏ రాము, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి జీ జ్యోతి పాల్గొన్నారు.



ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులతో కలెక్టర్ లక్ష్మీశ

ఫిక్కీ మహిళల మార్గదర్శనంతో ఆసరా

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న నిరుపేదలకు ఆసరా అందించి, జీవితంలో స్థిరపడేలా ఫిక్కీ మహిళా పారిశ్రామికవేత్తలు మార్గదర్శకులుగా నిలవాలని, ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో అమలుచేస్తున్న పీ-4 విధానంలో భాగస్వాములుగా ముందుకు రావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్‌వో)-విజయవాడ ప్రతినిధులతో బుధవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో పీ4 విధానం అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి, 2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎఫ్ఎల్‌వో మహిళా పారిశ్రామికవేత్తలు, సామాజిక దృక్పథంతో నిరుపేదలను ఆదుకోవడం ద్వారా రాష్ట్రాభివృద్ధిలో తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఆశించిన ఫలితాల సాధనకు పీ4 విధానంలో భాగస్వాములై బంగారు కుటుంబాలకు ఆసరా అందించాలని ఆయన మహిళా పారిశ్రామికవేత్తల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎఫ్ఎల్‌వో ప్రతినిధులు స్పందిస్తూ తమ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో సమావేశాన్ని నిర్వహించి బంగారు కుటుంబాలను వ్యక్తిగతంగా, సంస్థపరంగా ఎంపిక చేసుకొని అండగా నిలిచేందుకు కృషిచేస్తామన్నారు. ఎఫ్ఎల్‌వో విజయవాడ సీనియర్ వైస్ చైర్మన్ సుషియా మాలినేని, సెక్రటరీ సుమబిందు అట్లూరి, ట్రెజరర్ తుల్జాభవానీ దేవినేని, జాయింట్ సెక్రటరీ దీప్తి చలసాని, జిల్లా పరిశ్రమల అధికారి బీ సాంబయ్య పాల్గొన్నారు.

స్ప్రీ ఆరోగ్య బీమా.. కార్మికులకు మరింత ధీమా

ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ రామారావు

విజయవాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సామాజిక ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నూతన స్ప్రీ ఆరోగ్యబీమా పథకంతో కార్మికుల జీవితాలకు ధీమా కల్పిస్తున్నామని, ఈ పథకాన్ని సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం రామారావు చెప్పారు. విజయవాడలోని గుణదలలో సంస్థ రీజనల్ కార్యాలయంలో బుధవారం యజమానులు, ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ పథకం (ఎస్‌పీఆర్ఈఈ-2025) ప్రచార సామగ్రిని అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికరాజ్య బీమాసంస్థ 196వ సమావేశంలో స్ప్రీ పథకానికి ఆమోదం లభించిందన్నారు. కర్మాగారాలు, సంస్థలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పథకంలో నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి కాంట్రిబ్యూషన్/ప్రయోజనం వర్తించదన్నారు. పథకంలో జరిమానాలు ఉన్నాయన్న భయాలను తొలగించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసినట్టు వివరించారు. ఈ పథకం రాకముందు నిర్దిష్ట గడువులోపు నమోదు చేసుకోకపోతే చట్టపరమైన చర్యలతోపాటు పాత బకాయిలు వసూలుచేసే పరిస్థితి ఉండేదని, స్ప్రీ పథకంతో ఆ అడ్డంకులు తొలగాయన్నారు. ఇప్పటి వరకు నమోదు కాని సంస్థలు, కర్మాగారాలు తమ కార్మికులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఈ పథకం వీలు కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 69,632 కర్మాగారాలు, సంస్థల్లో దాదాపు 14 లక్షల మంది ఉద్యోగులు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారన్నారు. ఐఎంఎస్ డైరెక్టర్ వీ ఆంజనేయులు, స్టేట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్ ప్రదీప్ కుమార్, కర్మాగారాల డైరెక్టర్ డీ చంద్రశేఖర వర్మ, బాయిలర్స్ డైరెక్టర్ బీ ఉమామహేశ్వరరావు, ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస నవనీత్ పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ ప్రమోషన్ పథకం పోస్టర్లను విడుదల చేస్తున్న రామారావు, తదితరులు



పాస్‌పోర్టు డ్రైవ్‌లో పాల్గొన్న దరఖాస్తుదారులు

తుళ్లూరులో పాస్‌పోర్టు డ్రైవ్ విజయవంతం

కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) విజయవాడలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంతో కలిసి జూలై 22, 23న తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో రెండు రోజుల పాస్‌పోర్టు డ్రైవ్‌ను బుధవారం విజయవంతంగా నిర్వహించింది. జూలై 22న, మొత్తం 30 మంది దరఖాస్తుదారులు పాల్గొన్నారు. వారిలో 27 మంది విజయవంతంగా ప్రాసెస్ చేయబడ్డారు. జూలై 23న 37 మంది దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఇందులో 25 పాస్‌పోర్టులు ప్రాసెస్ చేయబడ్డాయి. ఈ డ్రైవ్‌ను ప్రాంతీయ పాస్‌పోర్టు అథారిటీ అధికారి మొహంతి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సేవల్లో కొత్త పాస్‌పోర్టు జారీ, పునరుద్ధరణ ఉన్నాయి. ఈ డ్రైవ్ విజయంతం కావడంతో 30 మంది దరఖాస్తుదారులకు సదుపాయంతో జూలై 25న మరో డ్రైవ్ జరగనుంది. ఈ సేవను పొందాలనుకొనే నివాసితులు అధికారిక పాస్‌పోర్టు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఏఆర్ఎన్ నెంబరును అధికారులు నియమించిన వ్యక్తి శంకర్ చల్లూరితో 9848424207 నెంబరులో పంచుకోవాలని పేర్కొన్నారు.

ఏపీసీఎస్ఐ సమావేశం చారిత్రకం

- ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ చంద్రశేఖర్

విజయవాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా - ఆంధ్రప్రదేశ్ (ఏపీసీఎస్ఐ) చాప్టర్ నిబంధనల ప్రకారం మొదటిసారిగా మంగళగిరిలో ఎస్ఆర్ఐ మెడికల్ కాలేజీలో 10వ వార్షిక సమావేశం ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ పీ చంద్రశేఖర్ అన్నారు. ఈ నెల 18 నుంచి 20 వరకు జరిగిన విజయోత్సవ సభ ఘనంగా జరిగిన నేపథ్యంలో బుధవారం నగరంలోని కార్డియో వైద్యులు నిర్వహించిన మీడి యా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తాను వైస్ చాన్సలర్‌గా ఉన్నప్పు డు రాష్ట్రంలో మొదటిసారిగా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. డాక్టర్ పీఎస్ చౌదరి, జాన్ సతీష్, గోపాలకృష్ణ, డాక్టర్ పీ రమేష్‌బాబు, 400పైగా డెలిగేట్లు, 124 ఔషధ, వైద్యపరికరాల రంగానికి చెందిన ప్రదర్శకులు, కార్డియాలజిస్టులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులో ఇరికించారంటూ ఐటీ ఉద్యోగి ఆందోళన

మచిలీపట్నం క్రైమ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విచారణ లేకుండా తనపై పోలీసులు కేసులు నమోదు చేశారని హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న చిలకలపూడి వెంకటేశ్వరరావు ఆరోపించారు. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కోడూరు మండలం పాలకాయతిప్పకు చెందిన చిలకలపూడి వెంకటేశ్వరరావు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బందరుకు చెందిన మేనమామ కుమార్తె భాగ్యశ్రీతో 2016లో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరు ఉప్పల్‌లో నివాసముంటున్నారు. వీరికి ఒక కుమారుడు ఉండగా, ప్రస్తుతం భాగ్యశ్రీ గర్భవతి. ఉద్యోగ పదోన్నతిలో భాగంగా వెంకటేశ్వరరావు కెనడా వెళ్లాల్సి ఉంది. భార్యాభర్తలిద్దరూ కెనడా వెళ్లేందుకు వీసాలు తీసుకున్నారు. ఇటీవల వారిద్దరికీ వివాదం జరిగింది. ఈనెల 18న భర్త వెంకటేశ్వరరావుతో గొడవపడి కుటుంబసభ్యులను రావాలని ఫోన్‌లో తెలిపింది. భాగ్యశ్రీ తండ్రి లంకె నాగరాయణప్రసాద్, బావమరిది భాస్కర్ హైదరాబాద్ వచ్చి భార్యను, కుమారుడిని తీసుకెళ్లారు. ఈక్రమంలో తనపై దాడిచేసి నగదు, బంగారంతోపాటు వీసా, తనకు చెందిన పత్రాలను తీసుకెళ్లినట్టు అదే రోజు హైదరాబాద్ మేడ్‌పల్లిలో వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. బందరు చేరుకున్న భార్య భాగ్యశ్రీ ఈనెల 19న ఇనుగుదురు పోలీస్‌స్టేషన్‌లో భర్త వెంకటేశ్వరరావు తనను కొట్టాడని, హింసించాడని ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఒంటిపై గాయాలున్నాయని, గృహ హింస కేసు నమోదు చేసినట్టు ఇనుగుదురు సీఐ పరమేశ్వరరావు పేర్కొన్నారు. ఎలాంటి కౌన్సెలింగ్ నిర్వహించకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని వెంకటేశ్వరరావు పేర్కొన్నాడు. తాను కెనడా వెళ్లకుంటే కంపెనీ విధించే అపరాధ రుసుం రూ.కోట్లలో చెల్లించాలని, తన భవిష్యత్తు నాశనమవుతుందని ఆయన వాపోతున్నాడు.

చోరీలకు పాల్పడిన ముగ్గురు విద్యార్థుల అరెస్టు

రూ.10.20 లక్షల విలువైన బంగారు, వెండి స్వాధీనం

మచిలీపట్నం క్రైమ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్స్ ఆడుతూ అప్పుల పాలై దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు 9వ తరగతి విద్యార్థులను మచిలీపట్నం పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.10.20 లక్షలు విలువైన 100 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 700 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు బందరు డీఎస్పీ చప్పిడి రాజ తెలిపారు. బుధవారం స్థానిక మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న ఆర్టీసీ కాలనీలో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వారికి వచ్చిన ఇన్‌పుట్ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరు బెట్టింగ్‌కు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడ్డారని వివరించారు. దొంగ బంగారం కొనుగోలు చేసిన కొక్కిలిగడ్డ రాము, వల్లూరు సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు త్వరగా ఛేదించిన ఏఎస్ఐ జే శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ కే శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ బీ శ్రీనివాసరావు, జీ కోటేశ్వరరావు. జీ రామకృష్ణను డీఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు. ఇన్‌చార్జ్ సీఐ కే యేసుబాబు, ఎస్ఐ బీ ప్రభాకర్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

ఆదిత్య డిగ్రీ కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నేడు

గుడివాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 25వ తేదీన దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ ఫార్మాస్యూటికల్ సంస్థ తన ఉత్పత్తి విభాగం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామక ప్రకియ 2021 నుంచి 2024 వరకు పాసవుట్ అయినవారు, 2025 చదువుతున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ట్రైనీ హెల్పర్ పోస్టుకు పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రికల్, డీజిల్ మెకానిక్), ట్రైనీ సూపర్‌వైజర్/గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌కు బీఎస్సీ కెమిస్ట్రీ, బి.ఫార్మశీ, బి.టెక్(కెమికల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఈఈఈ), ఎమ్మెస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, ఎమ్.ఫార్మశీ(ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ) వారు అర్హులన్నారు. అ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ రవీంద్రబాబు తెలిపారు.

ఆదమరిస్తే ఆస్పత్రికే..

- భారీ గోతులతో ప్రయాణం నరకం
- వాహనదారులకు తప్పని సర్కస్ ఫీట్లు
- పట్టించుకోని అధికారులు



పోలుకొండ నుంచి తమిరిశ వెళ్లే రోడ్డు ..



అనమనపూడి నుంచి ఊరిలోకి వెళ్లే రోడ్డు..

(ఆంధ్రజ్యోతి - నందివాడ): ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వ కారణం రోడ్లు అని చెప్పుకోవటం తప్ప. గోతుల రోడ్లపై ప్రయాణాలు చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం మోటారు బైకుపై ప్రయాణం చేయాలన్న పడరానిపాట్లు పాట్లు పడాల్సి వస్తోంది. తమిరిశ నుంచి పోలుకొండ ఆర్ అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గోతులతో నిండిఉంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ఏమాత్రం ఆదమరిచినా ఆస్పత్రి పాలవక తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. కురస్తున్న వర్షాలకు రోడ్లపై ఏర్పడ్డ గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నారు. దీంతో ఏది రోడ్డో, ఏది గొయ్యో తెలియక వాహనదారులు నిత్యం ప్రమాదాల బారీన పడక తప్పడం లేదు. ముఖ్యంగా తమిరిశ నుంచి నందివాడ వెళ్లాలంటే వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందన్నారు. కుదరవల్లి చెట్లు వద్ద నుంచి లక్ష్మీనరసింహాపురం రోడ్డు గత వైసీపీ ప్రభుత్వంలో మూడు కోట్లపైగా ఖర్చు చేసి రోడ్డుకు మరమ్మతులు చేశారు. మరమ్మతులు చేసి ఏడాది గడవక మునుపే రహదారులన్నీ ధ్వంసమై గోతులో నిండి పోయాయి. దీంతో రెండు రోజులకోసారి బస్సులు, ఆటోలు ఈ గోతుల్లో ఇరుక్కుపోయి గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం ఫోన్ చేసినా సమాధానం ఉండదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి కనీసం గోతులు పూడ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంచనాలు రూపొందించి అధికారులకు పంపాం

రహదారుల అభివృద్ధికి అంచనాలు రూపొందించి, ఉన్నతాధికారులకు పంపాం. నిధులు మంజూరు అవగానే ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపడతాం.

కామేశ్వరరావు , ఆర్అండ్‌బీ డీఈ

పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం

- మంత్రి బాల వీరాంజనేయస్వామి



ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

పామర్రు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందజేయడమే కూటమి ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. పామర్రులోని 17,19వ వార్డుల్లో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ సంక్షేమ పథకాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్నదాత సుఖీభవ,మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాలను త్వరలోనే ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అమలుచేసి ప్రజా ప్రభుత్వమని నిరూపించుకున్నామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, శంకర్‌బాబు, మధు, సుబ్రమణ్యం, రామంజనేయులు, టీడీపీ జిల్లా మహిళా నేత మైనేని ఇందిర పాల్గొన్నారు.

గుడివాడ : నియోజకవర్గ అభివృద్ధికి కార్యకర్తలు రోజుకు కేవలం 40నిమిషాలు కష్టపడితే చాలని, పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీలో ఎల్లప్పుగూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు, కుటుంబసాధికార సభ్యులతో వార్డుల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలన పూర్తయిందని, పార్టీ శ్రేణులు ఉత్సాహంలో పని చేయాలని పిలుపునిచ్చారు. సుపరిపాలనలో ఇంటింటి ప్రచారం, ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను మై టీడీపీ యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని గుడివాడలో విజయవంతంగా జరుగుతుందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్‌వ్యవస్థ వల్లే క్షేత్రస్థాయిలో పార్టీ బలపడిందన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో 40నిమిషాలు కష్టపడితే అనుకున్న లక్ష్యాలను సాదించవచ్చునని ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగం ప్రసాద్, పంద్రాజు సాంబశివరావు, చేకూరు జగన్మోహన రావు, పలు వార్డుల పరిధిలోని నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా ఆవుల సంచారం .. తప్పని ట్రాఫిక్ వెతలు



ప్రధాన రహదారిపై అడ్డదిడ్డంగా ఉన్న ఆవులు

గుడ్లవల్లేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బజారుమీద తిండి తినడం, రోడ్లమీద విశ్రాంతి తీసుకోవడం పాలిచ్చే సమయానికి యజమానుల దొడ్లోకి వెళ్లి పాలివ్వడం పరిపాటిగా మారుతోంది. దాదాపుగా 30 కి పైగా గోవులు గుడ్లవల్లేరులో రాత్రింబవళ్లు రోడ్లమీదే ఉంటున్నాయి. ప్రధానరహదారులపై పడుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నాయి. రాత్రివేళల్లో అయితే కొన్ని ఆవులు ముదురు బెరడు వర్ణంలో ఉండటం వల్ల ద్విచక్రవాహన చోదకులకు దగ్గరికి వచ్చేవరకూ కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడక తప్పడం లేదు. ప్రధాన కూడళ్లలో, ఊరు మొదట్లో గుంపులు గుంపులుగా ఆవులు రోడ్లపైనే సంచరిస్తున్నాయి. వీటికి ఇన్సూరెన్స్ ట్యాగ్‌లు కూడా ఉంటాయి. యజమానులు వాటిని ఊరుమీదకు వదిలేసి పాల సమయానికి పాలు తీసుకొంటుంటారు. ఆ ఆవులు కూడా సమయానికి యజమానుల వద్దకు వెళ్ళిపోతుంటాయి. ఆవులు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంటున్నా అటు పోలీసులు కానీ, ఇటు పంచాయతీ వారు కానీ ఏమాత్రం పట్టించుకోకపోవడం సోచనీయం. వీటిని పంచాయతీ వారు ఆవుల యజమానులను గుర్తించి వాటిని రోడ్లపైకి రాకుండా కట్టడి చేయించడమో, గోశాలలకు తరలిస్తే తప్ప రహదారుల్లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవని ప్రయాణికులు వాపోతున్నారు.

పంట బీమా చేయించుకోవడం తప్పనిసరి

- ఏడీఏ ఎస్.కవిత



దొండపాడులో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి ఎస్.కవిత

గుడివాడ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలను బీమా చేయించుకోవాలని ఏడీఏ ఎస్.కవిత అన్నారు. బుధవారం దొండపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరానికి రూ.830లు పంటల బీమా చేయించుకుంటే తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపరిహారం అందుతుందన్నారు. రైతులు రుణాలు తీసుకుంటున్నందున రుణాలు తీసుకునేటప్పుడు ఇన్సూరెన్స్ చేయించుకుని పంటను కాపాడుకోవాలని సూచించారు. మండలంలో ఇన్సూరెన్స్ తదితర విషయాలపై రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి మండలంలో రైతులు ఇన్సూరెన్స్‌తోపాటు సేంద్రియ వ్యవసాయం చేయాలని సూచించారు. రసాయనిక ఎరువులు వేయటం వద్ద భూసారం తగ్గుతుందన్నారు. రైతులు ఎక్కువ భాగం సేంద్రియ వ్యవసాయంపై మక్కువ చూపాలని కోరారు. మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి, సెరిగొల్వేపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు నూతక్కి కుటుంబరావు, వలివర్తిపాడు సాగునీటి సంఘం అధ్యక్షుడు లింగమనేని వీరబసవయ్య, చిట్టిబాబు, రైతులు పాల్గొన్నారు.



ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గణపతి నవరాత్రి మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

గుడివాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో అగస్ట్ 27వ తేదీన జరుగు గణపతి నవ రాత్రి మహోత్సవాల ముందస్తు సమాచారం ఆహ్వాన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) మాట్లాడుతూ అగస్ట్ 27వ తేదీ నుంచి గణపతి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. నవరాత్రుల స్వామి అలంకారంలో భాగస్వామ్యం అవ్వాలనుకునే భక్తులు రూ.1,116లు చెల్లించాలని కోరారు. అదే విధంగా సెప్టెంబర్ 3వ తేదీన ఏకాదశి రోజున లక్ష్మీగణపతి హోమం పూజలో పాల్గొనే భక్తులు రూ.516లు చెల్లించాలన్నారు. రూ.200లు చెల్లిస్తే నవరాత్రుల 9రోజులు గోత్రనామాలతో పూజలు చేస్తామన్నారు. ఉత్సవాల అనంతరం సెప్టెంబర్ 14వ తేదీన జరిగే మహాన్నసమారాధనలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, సభ్యులు ఎరికిపాటి సుశీల, విక్రుతి పోతురాజు, వీరమాచినేని శైలజ, వేదపండితులు కపిలవాయి గోపాలశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.



తాగునీటి చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్

తాగునీటి కలుషితంపై అప్రమత్తత అవసరం

గుడివాడ రూరల్: తాగునీటి చెరువుల్లోని నీరు కలుషితం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. బుధవారం దొండపాడు హరిజనవాడ తాగునీటి చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నాచు, తూడు కూలీలతో తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన చెరువును పరిశీలించారు. చెరువుల్లో ఎక్కువగా వ్యర్థాలు ఉండకుండా చూడాలని తెలిపారు. ప్రతి తాగునీటి చెరువును కార్యదర్శులు, పంచాయతీ రాజ్ సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. మండలంలో తాగునీరు సరఫరా చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, జగన్నాథరావు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

గుడ్లవల్లేరు :లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో బుధవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. గవిర్నేని లలిత కుమారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులచే ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లరావు, కార్యదర్శి కల్యాణపు నవాబు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, చాపరాల రాజేశ్వరరావు, జిల్లా మాజీ గవర్నర్ వైవీసీ ప్రసాద్, ఎ.వీరబద్రరావు, జంగం మోహనరావు, సూరపనేని పరందామయ్య తదితరులు పాల్గొన్నారు.

చేనిక్కడ .. పైరెక్కడ..!



వరద ముంపునకు గురైన వరిచేను

కూచిపూడి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గుర్రపు డెక్కతో డ్రెయిన్లు నిండిపోవటంతో పొలాల్లోని నీరు బయటకు వెళ్లకపోవటంతో ఇటీవల నాట్లు వేసిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. గత నాలుగు రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. డ్రెయిన్లలోని నీరు కిందకు వెళ్లేందుకు గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ఐనంపూడి, గేదెల కోడు, భీమ నది, ఉప్పాయి కోడు డ్రెయిన్లన్నీ గుర్రపు డెక్కతో నిండిపోయాయి. కారకంపాడు, నిడుమోలు, ఆవిరిపూడి, పెదపూడి, కూచిపూడి, మొవ్వ తదిరత గ్రామాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇటీవల నాట్లు వేసిన పొలాలు, వెదసాగు చేసిన పొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. వేసవిలో డ్రెయిన్లు, పంట కాలువలు పూడికతీత పనులు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవటం నేడు రైతులకు శాపంగా మారింది.

పేదరికం లేని సమాజమే పీ4 ధ్యేయం

- డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్

పెదపారుపూడి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం నిర్మాణం కోసం పెద్దమనస్సున్న మార్గదర్శకులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు బాసటగా నిలవాలని పెదపారుపూడి డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ అన్నారు. పీ4 గ్రామసభలో భాగంగా బుధవారం మండలంలోని జమిదింటకుర్రు, వానపాముల గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మండలంలో జూలై 21 నుంచి 25 వరకు అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నామన్నారు. అర్హుల జాబితాను మరోసారి ప్రజల దృష్టికి తెచ్చి సరి చేసేందుకు గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వానపాముల సర్పంచ్ పాతూరి రమేష్, పంచాయతీ కార్యదర్శులు సాగరరాణి, కృష్ణవేణి, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

గుడివాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కోతిబొమ్మ సెంటర్ హోలీక్రాస్ పాఠశాల వద్ద గల జమ్మలమూడి నవ్య పట్ల గన్నవరానికి చెందిన కారు ట్రావెల్స్ యజమాని తోట శ్రీరంగారావు అసభ్యకరంగా ప్రవర్తించినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 5వ తేదీన తోట శ్రీరంగారావు నవ్య ఇంటికి వచ్చి తాను పని నిమిత్తం గుడివాడ వచ్చానని, ఆరోగ్యం బాగోలేదని, కాసేపు విశ్రాంతి తీసుకుని వెళ్తానని చెప్పడంతో నవ్య ఒప్పుకున్నారు. రాత్రి 7గంటల సమయంలో ఇంట్లో టీవీ చూస్తుండగా శ్రీరంగారావు అసభ్యకరంగా ప్రవర్తించాడు. గతంలోనే భర్తతో కలిసి పలుమార్లు ఆయన ఇంటికి వచ్చినట్లు, మద్యం కూడా సేవించినట్లు పోలీసువర్గాలు తెలిపాయి. బుధవారం నవ్య యిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఎస్సై వి.జాస్మిన్ తెలిపారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె



గుడివాడలో..

గుడివాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శాకంబరీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విజయదుర్గ కోలాట భజన సమాజం ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ జవ్వాజి గంగరాజు, పోకూరు మోహనరావు, దుడ్డు చిన్నా, సీతారామస్వామి, పాల్గొన్నారు.



పామర్రులో..

పామర్రు: పామర్రులో వేంచేసియున్న అంకమ్మ తల్లి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం అమ్మవారు శాకాంబరీదేవి రూపంలో భక్తులకు దర్శమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌కు భక్తులు గాజులు, చీరలు, పూలు, స్వీట్లు, చలిమిడి తదితర వాటిని సారేగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నాబిషేకం చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. అప్పారావు , పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయవద్దు : డీఎస్పీ

గుడివాడ, జూలై 23(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంలలో వచ్చే ఏపీకే ఫైల్‌ను క్లిక్‌చేసి ఖాతాలను ఖాళీ చేసుకోవద్దని, సదరు ఫైల్‌ను విస్మరిస్తే ఆర్థిక ముప్పు తప్పదని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గౌరీశంకరపురంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వాట్సాప్‌లో వచ్చే సందేశాల ద్వారా ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేస్తే మొబైల్ ఫోన్ సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతుందన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి తక్షణ సమాయం పొందాలని డీఎస్పీతెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం నేడు

నందివాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ ద్వారా కొత్త లైను ఏర్పాటుకు నందివాడ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి (33/11కెవి) నందివాడ, తుమ్మలపల్లి, తమిరిశ, శ్రీనివాసపురం, వెన్ననపూడి, జనార్ధనపురం తదితర గ్రామాల్లో గురువారం విద్యుత్ ఉండదని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు.

మహిళల రక్షణే లక్ష్యం : సీఐ

పెదపారుపూడి : మహిళల రక్షణకు మహిళా పోలీసులు కృషి చేయాలని పామర్రు సీఐ వి.శుభాకర్ పేర్కొన్నారు. నూతనంగా బదిలీపై విధుల్లో చేరిన సచివాలయ మహిళా పోలీసులతో సీఐ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏమైనా ఉత్సవాలు, పండుగల సమయంలో అల్లర్లు జరిగే అవకాశం ఉంటే ముందస్తుగా తమకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, నాటుసారా వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు అందినా వెంటనే స్పందించి వాటిపై తగు చర్యలు తీసుకునే విధంగా తమను సంప్రదించాలని ఆయన సూచనలు అందించారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ

పెదపారుపూడి : యలమర్రుకు చెందిన దాత అట్లూరి అనన్య, అట్లూరి ఐశ్వర్య యలమర్రు -1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోకి 60 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు బహూకరించారు. యలమర్రుకు చెందిన అట్లూరి అచ్యుత రామారావు, సరోజిని దంపతుల జ్ఞాపకార్థం మనుమరాళ్లు అట్లూరి ఐశ్వర్య, అనన్య బుధవారం యలమర్రు -1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ మాట్లాడుతూ అట్లూరి ఐశ్వర్య, అనన్య ప్లేట్లు, గ్లాసులు అందించటం అభినందనీయమన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడ : ప్రతిఒక్కరూ సీట్ బెల్టు పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని ట్రాఫిక్ ఎస్సై నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక గౌరీశంకరపురం ట్యాక్సీ స్టాండ్ వద్ద ట్యాక్సీ డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సలు కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, వాహన రికార్డులన్నీ సక్రమంగా ఉండాలన్నారు. ప్రతి వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి గుడివాడ పోలీసు వారి సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

24 గంటల్లోనే హామీ నెరవేర్చిన మంత్రి నారాయణ

● గుణ్ణాల దళితవాడలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు

పెడన, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తాను ఇచ్చిన హామీని 24 గంటల్లోనే మంత్రి పి.నారాయణ నెరవేర్చారు. గుణ్ణాల దళితవాడలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20 లక్షల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేస్తూ పురపరిపాలన శాఖ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో ఉత్తర్వులు జారీ చేయించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుణ్ణాల దళితవాడలో మంత్రి నారాయణ పర్యటించారు. స్థానికులు కమ్యూనిటీ హాలుకు నిధులివ్వాలని కోరగా, రూ.20 లక్షలు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి నారాయణకు, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదరిక నిర్మూలనలో యువత భాగస్వామ్యం అభినందనీయం



మురారి సాత్విక్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ/చల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు చేపట్టిన పీ-4 కార్యక్రమానికి దేశవిదేశాల్లో స్థిరపడిన తెలుగువారి నుంచి మంచి స్పందన రావటం శుభపరిణామం. పేదరిక నిర్మూలనలో యువత భాగస్వామ్యం అభినందనీయం.' అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పీ-4 కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేందుకు ముందుకు వచ్చిన చల్లపల్లికి చెందిన మురారి సాత్విక్ బుధవారం అవనిగడ్డలోని కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాత్విక్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. సాత్విక్ 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో విదేశీ విద్యాపథకం ద్వారా ఐర్లాండ్ వెళ్లి ఎంఎస్ బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుకున్నాడు. అక్కడే కొంతకాలం ఉద్యోగం చేశాడు. తాజాగా ఐర్లాండ్‌లోనే వ్యాపారం ప్రారంభించాడు. కూటమి ప్రభుత్వ పీ-4 కార్యక్రమంలో నలుగురు పేద విద్యార్థులకు విదేశీ విద్యా అవకాశం కల్పించి స్కాలర్‌షిప్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాడు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే బృందం పర్యటన



నారాయణరావునగర్ కాలనీలో మోడల్ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్వే బృందం

చల్లపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే బృందం బుధవారం చల్లపల్లిలో పర్యటించింది. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రి పరిసరాలను పరిశీలించింది. మరుగుదొడ్ల పరిశుభ్రత, వినియోగిస్తున్న తీరును తెలుసుకుంది. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలించింది. గ్రామంలో పలు వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించి ప్రజలు వాడుతున్నారా లేదా అని తెలుసుకుంది. బృంద నాయకుడు సి.రవివర్మ, స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ అంకం ఏసోబు, ఎంపీడీవో ఏవీ రమణ, ఈవో ఆర్డీ రవిశంకర్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్ పాల్గొన్నారు.



సీనియర్ ఫొటోగ్రాఫర్ కృష్ణను సత్కరిస్తున్న ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలంకుర్తి శేషు తదితరులు

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలంకుర్తి శేషు డిమాండ్ చేశారు. డివిజన్ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫొటో, వీడియోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్పించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. సబ్సిడీపై ఫొటో, వీడియోగ్రాఫర్లకు రుణాలివ్వాలని సమావేశంలో తీర్మానించారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, వంకా అనంతకుమార్, మట్టా శ్రీరామ్, మాదిరెడ్డి సత్యనారాయణ, బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సుధారాణి

పంటల సాగులో రసాయనాల వినియోగం తగ్గించండి

ఘంటసాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'సార్వా పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందొచ్చు. పంటల సాగులో రసాయనాల అధిక వినియోగంతో సాగు ఖర్చు అధికమవుతుంది. రసాయనేతర పద్ధతులతో అవశేషరహిత పంట ఉత్పత్తులు పొందొచ్చు.' అని రైతులకు కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి సూచించారు. కేవీకే ప్రాంగణంలో సార్వా పంటల సాగులో మెళకువలపై బుధవారం నిర్వహించిన చర్చా గోష్ఠిలో ఆమె మాట్లాడారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, రేవతి, మంజువాణి, నవీన్, యశ్వంత్‌కుమార్, కోరమాండల్ కంపెనీ డివిజన్ మేనేజర్ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో రైతుక్షేత్ర పాఠశాల

సేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో తాడేపల్లిలో రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. క్షేత్ర పరిశీలన చేసి, ఫసల్ బీమా యోజన పథకం ప్రయోజనాలను వివరించారు. డాక్టర్ కె.వీరయ్య చౌదరి, ఏవో ఎం.రామ్మోహనరావు, డాక్టర్ ప్రేమ, టీడీపీ నాయకుడు యార్లగడ్డ వీరభద్రరావు, రైతులు పాల్గొన్నారు.

కోకనారాయణపాలెంలో పొలం పిలుస్తోంది

గూడూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కోకనారాయణపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిసాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాసరావు వివరించారు. వెద పద్ధతిలో కలుపు, ఎలుకల నివారణ, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఏవో జి.శివరామకృష్ణ ఏఈవో ప్రభాకర్, వీఏఏలు పాల్గొన్నారు.

వైద్యుడికి సత్కారం

నాగాయలంక, జూలై 23(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో ఐదేళ్లుగా ఉద్యోగ బాధ్యతలను నిర్వహించిన డాక్టర్ ఎం.ఇంద్రకుమార్‌రెడ్డి విజయవాడ సిద్ధార్థ వైద్యకళాశాలకు బదిలీ అయ్యారు. బుధవారం పీహెచ్‌సీలో సొర్లగొంది, ఎదురుమొండి, నాగాయలంక పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది అభినందన సభను నిర్వహించి ఆయనను సత్కరించారు. డాక్టర్ శ్యాంప్రసాద్, డా.వి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత బాలగంగాధర తిలక్

మచిలీపట్నం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర తిలక్.. స్ఫూర్తిప్రదాత అని బీజేపీ నాయకుడు దూళిపాళ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. బుధవారం గొడుగుపేటలో కూనపరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో తిలక్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. తిలక్ చిత్రపటానికి నివాళులర్పించారు. సూరిశెట్టి హరికృష్ణ, సీహెచ్ మల్లేశ్వరరావు, విన్నకోట సుబ్బారావు, జుజ్జూరి ప్రసాద్, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, జె.వి.సుబ్బారావు పాల్గొన్నారు.



మచిలీపట్నం 35వ డివిజన్‌లో పర్యటిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



పెడన 19వ వార్డులో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



సాలెంపాలెంలో పర్యటిస్తున్న టీడీపీ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్



కానూరులో పర్యటిస్తున్న తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ విమర్శలు

రాబోయే రోజుల్లో ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోతుంది ● సుపరిపాలన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. రానున్న రోజుల్లో ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోతుంది. ఆ పార్టీ నాయకులు అధికారంలో ఉండగా అడ్డగోలుగా ప్రవర్తించారు. కోట్లాది రూపాయల స్కాములు చేశారు. మాజీ మంత్రులు పేర్ని నానీ, రోజా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారు.' అని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. బుధవారం 35,37 డివిజన్లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలను సందర్శించారు. పాఠశాలలను పరిశీలించారు. కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, నగర టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, బచ్చుల అనిల్‌కుమార్, బాజానీ, ఖాజా, ఎండి ఇలియాస్ పాషా, అజీమ్ పాల్గొన్నారు.

కానూరులో..

బందరు మండలం కానూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం సాగునీరు సకాలంలో వదలడం వల్ల రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారన్నారు. పీతా రాము, బొమ్మిడి ఏడుకొండలు, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, మోపిదేవి కృష్ణ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

కోడూరు: కూటమి ప్రభుత్వంలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బా గోవర్ధన్ అన్నారు. సాలెంపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పిల్లి మల్లికార్జునరావు, అప్పికట్ల రవీంద్రబాబు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, కొప్పనాతి సత్యనారాయణ, మేడికొండ విజయ్, అంగ్రాజు శ్రీనివాసరావు, తోట సాంబశివరావు, తోట సూర్యం, బడే పిచ్చియ్య పాల్గొన్నారు.

2వ వార్డులో..

అవనిగడ్డ: 2వ వార్డు ఎస్టీ కాలనీలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను నమోదు చేసుకున్నారు. కర్రా సుధాకర్, బండే రాఘవ, పరుచూరి దుర్గాప్రసాద్, మండలి రామ్మోహనరావు, బచ్చు హనుమాన్, బండే కనకదుర్గ, బచ్చు కృష్ణకుమారి, మెగావత్తు గోపి, దాసినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ నేతల కోసం కొత్త జైళ్లు నిర్మించాలేమో: ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: 'అవినీతి కేసుల్లో వైసీపీ నాయకులంతా జైళ్ల పాలవుతున్నారు. వారికోసం కొత్త జైళ్లు నిర్మించాలేమో' అని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఎద్దేవా చేశారు. పట్టణంలోని 19వ వార్డులో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. యక్కల శ్యామలయ్య, పరసా సూర్యనారాయణ, పరసా జితేంద్ర, కమ్మగంటి బాబు పాల్గొన్నారు.

ఉపాధి నిధులు విడుదల చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

మచిలీపట్నం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు ఉపాధి పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నార్త్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు ప్రదర్శన నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.94,500 కోట్లు ఉపాధి హామీ పనులు మంజూరు చేయాల్సి ఉండగా రూ.86వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఈ నిధుల్లో రాష్ట్రానికి 1,136 కోట్లు కేటాయిస్తే చంద్రబాబు ప్రభుత్వం రూ.169 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. వంద రోజుల పనిదినాలు కల్పించాల్సి ఉంటే 50 నుంచి 60 రోజులు మాత్రమే పనిదినాలు కల్పిస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరిగిపోవడంతో వ్యవసాయ కూలీలకు పనిదినాలు తగ్గిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కూలీ సంఘ నాయకులు కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తపాలా జీవిత బీమా ఏజెంట్లకు ఇంటర్వ్యూలు

మచిలీపట్నం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాల పాలసీలు సేకరించేందుకు ఏజెంట్ల నియమించుకుంటున్నామని, ఆగస్టు 6న ఉదయం హెడ్ పోస్టాఫీసులో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. 10వ తరగతి పాసై, బీమా రంగంపై అవగాహన ఉన్నవారు అర్హులని తెలిపారు. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాలు తీసుకుని ఇంటర్వ్యూకు రావాలని, మరిన్ని వివరాలకు 76618 96659కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన సూచించారు.

పది ఎకరాల గడ్డివామి దగ్ధం

అవనిగడ్డ రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మోదుమూడిలో ఆదూరి ఆంజనేయులు ఇంటి వద్ద ఉన్న 10 ఎకరాల గడ్డివామి దగ్ధమైంది. అగ్నిమాపక శాఖాధికారులు వచ్చి సహాయ చర్యలు చేపట్టారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు

గోపన్న డ్రెయినేజీ పూడికతీత

కోడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోపన్న డ్రెయినేజీ పూడికతీత పనులను ద్వారకా వద్ద బుధవారం తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సహకారంతో నియోజకవర్గంలో అన్ని ప్రధాన డ్రెయినేజీల పూడికతీత పనులు చేస్తున్నామని ఆయన తెలిపారు. జనసేన జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, నాయకులు కోట రాంబాబు, ఉల్లిపాలెం, ఇరాలి నీటి సంఘాల అధ్యక్షుడు శివాజీ, గంజాల సుందరరావు, సిద్ధినేని అశోక్‌నాయుడు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, ముద్దినేని చంద్రరావు పాల్గొన్నారు.

ప్రారంభం కాని గండి పూడ్చే పనులు

● రాకపోకలకు ఇబ్బందిపడుతున్న కొత్తమాజేరు గ్రామస్థులు

చల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొత్తమాజేరు లింగన్నకోడు వంతెనపై రాకపోకలు ఇంకా పునఃప్రారంభం కాలేదు. గండి పడి రోజు గడిచినప్పటికీ పనులు చేపట్టేందుకు అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. గుండేరులో నీటిప్రవాహ ఉధృతి కారణంగా వంతెనకు ఒకవైపున తారురోడ్డు కింద ఊలపడి మట్టిపెళ్లలు విరిగిపడి రోడ్డు కుంగిపోయి రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఆర్ అండ్ బీ అధికారులు తరలివచ్చి పరిస్థితిని సమీక్షించి కాంట్రాక్టరుకు సూచనలు అందించి బుధవారం పనులు చేపడతామని చెప్పినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. వంతెన రోడ్డు మధ్యలో పెద్ద గండి పడటంతో ఆ గండిని కొండరాళ్లతో పూడ్చి పటిష్ఠ చర్యలు చేపట్టాలి. దీనికితోడు గుండేరులో నీటిప్రవాహం గండి దిగువకు రాకుండా చూడాలి. గండి పూడ్చేందుకు కొండరాళ్లు, ఇతర మెటీరియల్‌ను తీసుకువచ్చే టిప్పర్లు రాత్రివరకూ మాజేరుకు చేరుకోలేదు. కొండరాళ్ల లోడింగ్ జరిగినప్పటికీ ఆ ప్రాంతంలో రహదారి మార్గంలో ఇబ్బందులు తలెత్తటంతో అక్కడ రహదారి మరమ్మతులు చేసేంతవరకూ టిప్పర్లు కదలని పరిస్థితి ఉందంటున్నారు. గురువారం ఉదయం గండిని పూడ్చే పనులు చేపడతారని తెలుస్తోంది. వంతెనపై రాకపోకలు నిలిచిపోవడంతో మాజేరు నుంచి బయటకు వచ్చేందుకు మంగళాపురం మీదుగా, లేదా చిన్నాపురం మీదుగా చుట్టూతిరిగి రావాల్సివస్తోంది. అధికారులు గురువారమైనా గండిని పూడ్చి రాకపోకలు పునరుద్ధరించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. వంతెన వద్ద గుర్రపుడెక్క పనులు కొనసాగుతున్నాయి.

గండిని పరిశీలించిన మండలి వెంకట్రామ్



గండిని పరిశీలిస్తున్న మండలి వెంకట్రామ్, డ్రెయినేజీ డీఈఈ బాబూనాయక్

మాజేరుకు రాకపోకలు నిలిచిపోవడంతె ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ గండిపడిన ప్రదేశాన్ని బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టనున్న మరమ్మతులపై ఆరా తీశారు. వంతెన పటిష్ఠత, గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలించారు. డ్రెయినేజీ డీఈఈ బాబూనాయక్, డీసీ వైస్ చైర్మన్ పరిశె చలపతిరావు పర్యవేక్షిస్తున్నారు.

గుండేరుపై పాత వంతెన తొలగింపు పనులు

మచిలీపట్నం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): చిన్నాపురం వద్ద గుండేరుపై బ్రిడ్జి ఇటీవల కూలిపోయింది. దీని కారణంగా డ్రెయిన్ పరిధిలోని పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. సమస్యను చిన్నాపురం, వెంకటాపురం, మాజేరు, కోన, గుండుపాలేనికి చెందిన రైతులు మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కూలిపోయిన బ్రిడ్జి తొలగించేందుకు రూ.15 లక్షలు మంజూరు చేశారు. అధికారులు కూలిపోయిన వంతెన తొలగించే పనులు ప్రారంభించారు. 2018లో వంతెనకు ప్రత్యామ్నాయంగా కొల్లు రవీంద్ర మంత్రిగా ఉన్న సమయంలో నూతనంగా వంతెన నిర్మించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోయింది. పనులను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్, గుండుపాలెం పీఏసీఎస్ చైర్మన్ తూమాటి బసవశంకరరావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు పర్యవేక్షించారు.

ఫిజియోథెరపిస్టుకు సన్మానం

చల్లపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో ఆరేళ్లుగా ఫిజియోథెరపిస్టుగా సేవలందించి మచిలీపట్నం మెడికల్ కళాశాలకు బదిలీపై వెళుతున్న డాక్టర్ వంశీని ఆస్పత్రిలో బుధవారం సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఆస్పత్రి డైరెక్టర్ వరదా హరిగోపాల్, సూపరింటెండెంట్ డాక్టర్ బీఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ మహేష్, డాక్టర్ వంశీరామకృష్ణ, డాక్టర్ నీలిమ, డాక్టర్ బి.నిహారిక, డాక్టర్ దుర్గాశైలజ, సీనియర్ నర్సులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వినియోగదారుల సమన్వయ సమితి జిల్లా జనరల్ సెక్రటరీగా బండ్రెడ్డి రవీంద్ర



రవీంద్రను సత్కరిస్తున్న జనసేన నాయకులు

నాగాయలంక, జూలై 23(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితికి ఉమ్మడి కృష్ణా జిల్లా జనరల్ సెక్రటరీగా టి.కొత్తపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు బండ్రెడ్డి రవీంద్ర నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి బాబూరాజేంద్రప్రసాద్ నుంచి ఆయనకు బుధవారం నియామక పత్రం అందింది. జనసేన మండల నేత బండ్రెడ్డి హరి తదితరులు రవీంద్రను సత్కరించి, అభినందనలు తెలిపారు.

హరిహర వీరమల్లు విజయవంతమవ్వాలని పూజలు

అవనిగడ్డ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు విజయవంతమవ్వాలని జనసేన నాయకులు లంకమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేతలు మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శేషుబాబు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, దివి ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, చిరంజీవి అభిమాన సంఘం జిల్లా కార్యదర్శి అప్పికట్ల తారక మస్తాన్, బండ్రెడ్డి నాగమల్లికర్జునరావు, బొప్పన భాను, కటికల వసంత్ జనసేన నాయకులు బచ్చు కృష్ణకుమారి, సిద్ధినేని అశోక్ నాయుడు, గుడివాక శివరావు పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం

అవనిగడ్డ, జూలై 23(ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ(బీఎంఎస్) 71వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ పూర్వ కార్యదర్శి అద్దంకి సాంబశివరావు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ కార్యాలయం వద్ద సంఘ జెండాను ఎగురవేశారు. సంఘం సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. యూనియన్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సంఘ సభ్యులను సాంబశివరావు కోరారు.